Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

బుధవారం
4 సెప్టెంబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 118
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar

## ఆప్‌తో పొత్తుకు కాంగ్రెస్ కసరత్తు

- మరో నెలలో హరియాణ అసెంబ్లీ ఎన్నికలు
- ఇక 30 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన కాంగ్రెస్ పార్టీ త్వరలో జాబితాను విడుదల
- ఆప్‌తో ఎన్నికల పొత్తుకు సంబంధించి చర్చలపై కాంగ్రెస్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు
- హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి దీటైన పోటీ ఇవ్వడం ద్వారా విపక్ష ఇండియా కూటమి పటిష్టంగా ఉందనే సంకేతాలు
- పంజాబ్‌లో 90 అసెంబ్లీ స్థానాలకు గాను ఆప్ అభ్యర్థులకు 3, 4 స్థానాలు



## 'అపరాజిత' బిల్లుకు బెంగాల్ అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం

- అత్యాచారాలు మానవత్వానికి మాయని మచ్చ
- అలాంటి నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు సామాజిక సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది
- సీబీఐ నుంచి న్యాయం కోరుతున్నామని, దోషులకు మరణశిక్ష విధించాలని తాము కోరుతున్నాం
- 'అపరాజిత' బిల్లుతో సత్వర విచారణ, బాధితులకు న్యాయ లభిస్తుంది
- బిల్లు పాస్ కాగానే ప్రత్యేక అపరాజిత టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు





## వరద బాధితులకు కేంద్ర సాయం

- కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- చనిపోయిన వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 3లక్షలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి.. వారం రోజుల కంటే ఎక్కువ రోజులు ఉంటే రూ. 16వేలు, వారం లోపుల ఆస్పత్రిలో ఉంటే రూ. 4 వేలను ఆస్పత్రి ఖర్చులకు కేంద్రం ఇస్తుంది
- ఎస్డీఆర్ఎఫ్ నిధులతో బాధితులను ఆదుకోవాలి
- యుటిలైజేషన్ నిధులపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇప్పటివరకు ఎలాంటి రిపోర్ట్ విడుదల చేయలేదు

# ప్రాణనష్టం తగ్గించగలిగాం

- తెలంగాణలో వర్షాలు, వరదలపై రేవంత్ రెడ్డి
- మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదయిందని వెల్లడి
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించామన్న సీఎం
- పంట నష్టం అంచనా వేసి పరిహారం చెల్లిస్తామన్న ముఖ్యమంత్రి
- తెలంగాణ అంతా హైడ్రా లాంటి వ్యవస్థ



**శుభ తెలంగాణ వరంగల్ :**

భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పటికీ అధికారుల చర్యలతో ప్రాణనష్టం తగ్గించగలిగామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాల్లో వరదలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ... మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదయిందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించినట్లు తెలిపారు. పంట నష్టం అంచనా వేసి పరిహారం అందిస్తామన్నారు. నష్టపోయిన 3 తండాల వాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. ఖమ్మంలో ఆక్రమణల వల్లే భారీ వరదలు వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. మున్నేరు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపుపై ఇంజినీర్లతో చర్చిస్తామన్నారు. ఆక్రమణలను గుర్తించి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఏడున్నర దశాబ్దాల్లో ఎన్నడూ లేని విధంగా 42 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయిందన్నారు. మహబూబాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి వరదలపై చేసిన సమీక్షలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హైడ్రా తరహాలో ప్రతి జిల్లాలోనూ ఒక వ్యవస్థను కలెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశించారు. చెరువులను ఆక్రమించుకో వడం క్షమించరాని నేరం అని.. చెరువుల ఆక్రమణలపైన రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడతామని రేవంత్ రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు పాల్పడినది ఎంతటి వారైనా వదిలి పెట్టబోమని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. - మిగతా3లో

## వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్



- గత మూడు నాలుగు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి
- భారీ వర్షాలకు ఖమ్మం జిల్లాలో తీవ్రమైన నష్టం జరిగింది
- వరదల విషయంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది
- రేవంత్ రెడ్డి ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడం వల్ల, ప్రజలను అలర్ట్ చేయకపోవడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం పెద్ద ఎత్తున జరిగింది
- సీఎం రేవంత్ రెడ్డికి వ్యంగ్యం ఎక్కువ.. పనితనం తక్కువ : హరీశ్ రావు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**శుభ తెలంగాణ ఖమ్మం**

ఖమ్మం జిల్లాలో వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. గత మూడు నాలుగు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు ఖమ్మం జిల్లాలో తీవ్రమైన నష్టం జరిగింది. సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాల వల్ల జనజీనవం అతలాకులతమైంది. భారీగా ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరిగింది. వరదల విషయంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడం వల్ల, ప్రజలను అలర్ట్ చేయకపోవడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం పెద్ద ఎత్తున జరిగిందన్నారు హరీశ్‌రావు. పార్టీ తరపున వరద బాధితులకు సహాయం అందించేందుకు సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్, జగదీశ్ రెడ్డి, రవిచంద్ర, నామా నాగేశ్వర్ రావు, వివేకానంద గౌడ్, కౌశిక్ రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, శంభీపూర్ రాజు వచ్చాం. ప్రభుత్వం చేపడుతున్న వరద - మిగతా3లో



## రెండు తెలుగు రాష్ట్రాలకు బాలకృష్ణ భారీ విరాళం

- తెలుగు రాష్ట్రాలకు తీవ్ర నష్టం కలగజేసిన భారీ వర్షాలు
- బాధితులను ఆదుకునేందుకు ముందుకు వస్తున్న ఫిల్మ్ ఇండస్ట్రీ
- రెండు రాష్ట్రాలకు రూ. 50 లక్షల చొప్పున విరాళం ప్రకటించిన బాలయ్య

## ఔటర్ రింగ్ రోడ్డులోని 51 గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేస్తు ఆర్డినెన్స్

- రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని పలు గ్రామాల విలీనం
- ఒక్కో మున్సిపాలిటీలో ఒకటి నుంచి ఆరు గ్రామాల విలీనం
- శంషాబాద్, పెద్దఅంబర్‌పేట సహా పలు మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనం



## విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

- ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర పాలసీ తయారీకి కమిషన్ ఏర్పాటు
- ఛైర్మన్, ముగ్గురు సభ్యులతో విద్యా కమిషన్ ఏర్పాటు
- త్వరలో వీరిని నియమించనున్నట్లు వెల్లడి


# 8 రోజుల సీబీఐ కస్టడీకి ప్రొ. సందీప్ ఘోష్

**కోల్‌కతా, సెప్టెంబర్ 03:** కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ఆర్థిక అవకతవకలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలపై అరెస్టయిన మాజీ ప్రిన్సిపల్ ప్రొ. సందీప్ ఘోష్‌కు కోర్టు 8 రోజుల సీబీఐ కస్టడీ విధించింది. ఈ మేరకు కోల్‌కతాలోని సీబీఐ ప్రత్యేక కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఇవే ఆరోపణలపై సోమవారం ప్రొ. సందీప్ ఘోష్‌ను సీబీఐ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆయనతోపాటు మరో ముగ్గురు.. బిప్లవ్ సింఘా, సుమన్ హజారా, అఫ్సర్ అలీ ఖాన్‌లను సైతం సీబీఐ అరెస్ట్ చేసింది. మంగళవారం ప్రత్యేక కోర్టులో వీరిని సీబీఐ ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో వారికి 8 రోజుల సీబీఐ కస్టడీ విధిస్తూ.. కోర్టు ఆదేశించింది. అనంతరం ఈ కేసును సెప్టెంబర్ 10వ తేదీకి సీబీఐ కోర్టు వాయిదా వేసింది. అయితే ఈ కేసులో విచారించేందుకు 10 రోజులపాటు వీరిని తమ కస్టడీకి అప్పగించాలని కోర్టును సీబీఐ అభ్యర్థించింది. కానీ కోర్టు మాత్రం కేవలం 8 రోజులు మాత్రమే వీరిని కస్టడీకి అప్పగిస్తూ ఆదేశించింది. ఇక కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ నలుగురిలో ఒకరైన అఫ్సర్ అలీ ఖాన్ పెట్టుకున్న పిటిషన్‌ను కోర్టు ఈ సందర్భంగా తోసిపుచ్చింది. ఆగస్ట్ 9వ తేదీన కోల్‌కతాలోని ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచారం జరిగింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ హత్యాచారం ఘటన జరిగిన కొన్ని గంటలకే కాలేజీ ప్రిన్సిపల్ పదవికి ప్రొ. సందీప్ ఘోష్ రాజీనామా చేశారు. అనంతరం ఎక్స్ వేదికగా ఈ హత్యాచార ఘటనపై స్పందిస్తూ.. మృతురాలు తన కుమార్తెతో సమానమన్నారు. ఈ తరహా ఘటనలు భవిష్యత్తులో జరగకుండా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. మరోవైపు ఈ కాలేజీ ప్రిన్సిపాల్ పదవికి రాజీనామా చేసిన కొన్ని గంటలకే ప్రొ. సందీప్ ఘోష్‌కు మమతా బెనర్జీ ప్రభుత్వం మరో కీలక పదవిలో ఆయన్ని నియమిస్తూ ఆగమేఘాల మీద ఆదేశాలు జారీ చేసింది. ఇక ట్రైయినీ వైద్యురాలి హత్యాచార ఘటనపై విచారణ చేపట్టిన కోల్‌కతా హైకోర్టు.. ప్రొ. సందీప్ ఘోష్ సెలవుపై పంపాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇంకోవైపు ఆర్ జీ కర్ మెడికాల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొ. సందీప్ ఘోష్ ఆర్థిక అవకతవకలు పాల్పడ్డారంటూ సదరు కాలేజీ మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అఖ్తర్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ ఈ చర్యలు తీసుకుంది. ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచారం కేసులో ప్రొ. సందీప్ ఘోష్‌ను వరుసగా 15 రోజుల పాటు సీబీఐ ప్రశ్నించింది. అనంతరం ఆయన ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారన్న కేసులో సీబీఐ ఆయన్ని అరెస్ట్ చేసింది.



# ఎన్‌కౌంటర్‌లో 9 మంది మావోయిస్టులు మృతి

**ఛత్తీస్‌గఢ్ :** ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తొమ్మిది మంది మావోయిస్టులు మృతి చెందారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో మావోయిస్టుల మృతదేహాలతోపాటు పలు ఆయుధాలను సైతం స్వాధీనం చేసుకున్నామని పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు. వాటిలో 303 సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్‌తోపాటు 12 తుపాకులున్నాయని వివరించారు. బీజాపూర్, దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో భారీగా మావోయిస్టులు ఉన్నారంటూ మంగళవారం ఉదయం సమాచారం అందిందని తెలిపారు. దీంతో ఆ యా ప్రాంతాల్లో పోలీసులు కూబింగ్ చేపట్టారన్నారు. ఆ క్రమంలో మావోయిస్టులు.. పోలీసులపైకి కాల్పులకు తెగబడ్డారని చెప్పారు. ఆ వెంటనే పోలీసులు సైతం స్పందించి.. ఎదురు కాల్పులకు దిగారని పేర్కొంది. ఈ రెండు జిల్లాల సరిహద్దుల్లో పోలీసుల కూబింగ్ ఇంకా కొనసాగుతుందన్నారు. మరోవైపు దేశవ్యాప్తంగా మావోయిస్టులను నిర్మూలించే కార్యక్రమానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా.. గత వారం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన మావోయిస్టులను అంతమొందించేందుకు కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితోపాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన కీలక ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం కేంద్ర మంత్రి అమిత్ షా విలేకర్లతో మాట్లాడుతూ.. మావోయిస్టులతో ప్రభుత్వం చేస్తున్న పోరాటం తుది దశకు చేరుకుందన్నారు. 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందని వివరించారు. అలాగే మావోయిస్లుల లొంగుబాటుకు కేంద్రం ప్రత్యేక విధానాన్ని మరో రెండు నెలల్లో తీసుకు వస్తుందని తెలిపారు. ఇంకోవైపు అమిత్ షా సమావేశం జరిగిన 48 గంటల అనంతరం ఛత్తీస్‌గఢ్‌లో 25 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో అయిదుగురిపై రూ.28 లక్షల రివార్డు ఉంది. బీజాపూర్‌లో ఇప్పటి వరకు 176 మంది మావోయిస్టులు లోంగిపోయారు.



# రెండు తెలుగు రాష్ట్రాలకు బాలకృష్ణ భారీ విరాళం

భారీ వరదల కారణంగా ఇరు తెలుగు రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ నేపథ్యంలో వరద బాధితులను ఆదుకునేందుకు చిత్ర పరిశ్రమ ముందుకు వస్తోంది. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు విరాళాలను ప్రకటించారు. రెండు తెలుగు రాష్ట్రాలను వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. ముఖ్యంగా ఏపీలోని విజయవాడ, తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. రంగంలోకి దిగిన అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అనేక మంది ప్రజలు ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలో వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు సినీ తారలు, రాజకీయ ప్రముఖులు ముందుకు వస్తున్నారు. తమ వంతు సాయంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు ప్రకటిస్తున్నారు.

తాజాగా ఎమ్మెల్యే, నటసింహ నందమూరి బాలకృష్ణ సైతం భారీ విరాళం ప్రకటించారు. వరద బాధితుల సహాయార్థం తన వంతు సాయంగా ఒక్కో రాష్ట్రానికి రూ.50 లక్షలు చొప్పున మొత్తం రూ.కోటి విరాళంగా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి ఈ మొత్తాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. '50 ఏళ్ళ క్రితం మా నాన్నగారు నా నుదుటిన దిద్దిన తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది. 50 ఏళ్ల నుంచి నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది.. వెలుగుతూనే ఉంది. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగుజాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది. ఈ ఋణం తీరనిది. ఈ జన్మ మీ కోసం.. మీ ఆనందం కోసం. నా ఈ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ప్రస్తుతం తెలుగు నేలను వరద ముంచెత్తుతోంది. ఈ విపత్కర పరిస్థితులలో బాధాతప్త హృదయంతో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు, అదేవిధంగా తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు నా బాధ్యతగా బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నాను. రెండు రాష్ట్రాల్లో అతి త్వరలోనే సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. మీ నందమరి బాలకృష్ణ' అని



# తోడేళ్లు కనిపిస్తే కాల్చేయండి.. సీఎం ఆదేశాలు

**లఖ్‌నవూ :** ఉత్తరప్రదేశ్‌లోని బహరాయిచ్ జిల్లా ప్రజలను తోడేళ్లు భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. చిన్నారులపై దాడి చేసి వారి ప్రాణాలను బలిగొంటున్నాయి. అటువంటి పరిస్థితుల్లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తోడేళ్లు కనిపిస్తే కాల్చివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చిన్నారులపై తోడేళ్లు దాడి చేసి.. వారి ప్రాణాలు తీస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'ఆపరేషన్ బేడియా' పేరటి గతంలో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా నాలుగు తోడేళ్లను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. అయినా తోడేళ్ల దాడి మాత్రం ఆగకుండా కొనసాగుతుంది. దీంతో బహరాయిచ్ జిల్లాలో తోడేళ్ల దాడిపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధ్యక్షతన జరిగిన ఉన్నతాస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ దాడుల ఘటనలకు సంబంధించిన తీవ్రతను దృష్టిలో పెట్టుకుని.. తోడేళ్లు కనిపిస్తే కాల్చివేయాలని సీఎం యోగి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం రాత్రి గిరిధర్‌పూర్ ప్రాంతంలో అయిదేళ్ల బాలికపై తోడేలు దాడి చేసింది. అంతలో కుటుంబ సభ్యులు స్పందించడంతో.. బాలికను వదిలి తోడేలు అక్కడి నుంచి పరారైంది. తోడేలును పట్టుకునేందుకు ప్రయత్నించారు. అది చిక్కకుండా పరారైంది. బాలికను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆ చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. మరోవైపు హర్ది ప్రాంతంలో తల్లి పక్కనే నిద్రిస్తున్న బాలుడి పీకను తోడేలు నోట కరిచి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించింది. ఇంతలో వింత శబ్దం వినిపించడంతో.. ఆ తల్లి మేల్కొని తోడేలు మెడను గట్టిగా పట్టుకుంది. అనంతరం ఆమె బిగ్గరగా కేకలు వేసింది. స్థానికులు వెంటనే స్పందించి.. అక్కడకి రావడంతో ఆ బాలుడిని వదిలి తోడేలు పరారైంది. ఆ బాలుడు సైతం ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బహరాయిచ్ జిల్లాలో వరుస తోడేళ్ల దాడుల కారణంగా 35 గ్రామాల్లో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది.



**తోడేళ్ల దాడులపై జిల్లా కలెక్టర్ స్పందన..**

ఈ ఏడాది జులై 17వ తేదీ నుంచి జిల్లాలో చిన్నారులపై తోడేళ్లు దాడి చేస్తున్నాయని బెహరాయిచ్ జిల్లా కలెక్టర్ మోనికా రాణి వెల్లడించారు. తోడేళ్ల దాడుల్లో ఇప్పటి వరకు 8 మంది మరణించారని తెలిపారు. వారిలో ఏడుగురు చిన్నారులే ఉన్నారన్నారు. ఈ తోడేళ్ల దాడిలో మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. తోడేళ్లను పట్టుకునేందుకు పోలీసులు, అటవీ శాఖ అధికారులు, స్థానిక పంచాయతీ అధికారులు సంయుక్తంగా కలిసి పని చేస్తున్నారని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో తోడేళ్ల ఆచూకీ కోసం డ్రోణుల సహాయం తీసుకుంటున్నామని వెల్లడించారు. చిన్నారులపై దాడి చేస్తున్న తోడేళ్లను పట్టుకునేందుకు జిల్లా యంత్రాంగం పలు చర్యలు సైతం చేపట్టిందని వివరించారు. అందులోభాగంగా టెడ్డి బొమ్మలను చిన్నారుల మూత్రంతో తడిపి అటవీ, నిర్మానుష్య ప్రాంతంలో ఉంచుతున్నామని చెప్పారు. ఈ టెడ్డి బొమ్మలను చిన్నారులుగా భ్రమించి.. తోడేళ్ల వస్తే పట్టుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇంకోవైపు తోడేళ్ల గుంపు ప్రాంతాలను మారుస్తూ.. జిల్లాలో సంచరిస్తుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అందువల్లే తోడేళ్లను పట్టుకోవడంలో తీవ్ర ఆలస్యమవుతుందని చెప్పారు.

## డెంగ్యూని ఎపిడెమిక్‌గా ప్రకటించిన కర్ణాటక సర్కారు..

పొరుగు రాష్ట్రమైన కర్ణాటక డెంగ్యూ జ్వరాలతో అల్లాడుతున్నది. ఈ క్రమంలో డెంగ్యూని ఎపిడెమిక్‌గా ప్రకటించింది. దీంతో పాటు కర్ణాటక ఎపిడెమిక్ డిసీజెస్ రెగ్యులేషన్ 2020ని సవరించేందుకు నియమాలను రూపొందించింది. ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 7,362 డెంగ్యూ కేసులు రికార్డయ్యా యి. ఇప్పటివరకు ఏడుగురు మరణించారు. డెంగ్యూ రోగులను చేర్చుకోవడానికి ఆసుపత్రిలోని ప్రతి వార్డులో పది పడకలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. డెంగ్యూ నివారణకు కార్యాచరణ ప్రణాళికను సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. మురికివాడల్లో నివసించే ప్రజలకు దోమతెరలు అందిస్తామని.. ప్రభుత్వం పరిస్థితిని పర్యవేక్షించాలని అన్నిశాఖలకు ఆదేశాలు ఇచ్చిననట్లు కర్ణాటక ఆరోగ్యమంత్రి దినేశ్ తెలిపారు. డెంగ్యూ వ్యాప్తిని తగ్గించేందుకు అన్నిశాఖలను కఠినమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇంటింటికి వెళ్లి సేవలు అందించాలని ఆశా వర్కర్స్, వలంటీర్లను కోరామన్నారు. దోమల వ్యాప్తిని నివారించి.. డెంగ్యూ వ్యాప్తిని అరికడతామన్నారు.




## ఆప్‌తో పొత్తుకు కాంగ్రెస్ కసరత్తు

హరియాణ అసెంబ్లీ ఎన్నికలు మరో నెలలో జరగనుండటంతో ఆ రాష్ట్రంలో ఆప్‌తో పొత్తుకు కసరత్తు సాగించాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలను కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ ఎన్నికల కమిటీ భేటీలో రాహుల్ గాంధీ ఆప్‌తో పొత్తు ప్రతిపాదనను పరిశీలించాలని పార్టీ ముందుంచినట్టు సమాచారం. పంజాబ్‌లో 90 అసెంబ్లీ స్థానాలకు గాను ఆప్ అభ్యర్థులకు 3, 4 స్థానాలు కేటాయించాలని కోరినట్టు పంజాబ్ మాజీ సీఎం భూపీందర్ సింగ్ హుడా చెప్పారు. ఇక 30 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన కాంగ్రెస్ పార్టీ త్వరలో జాబితాను విడుదల చేయనుంది. ఆప్‌తో ఎన్నికల పొత్తుకు సంబంధించి చర్చలపై కాంగ్రెస్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి దీటైన పోటీ ఇవ్వడం ద్వారా విపక్ష ఇండియా కూటమి పటిష్టంగా ఉందనే సంకేతాలు పంపేందుకు రాహుల్ గాంధీ ఆప్‌తో పొత్తుకు ఆసక్తి కనబరుస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పంజాబ్‌లో ఇటీవల ముగిసిన పార్లమెంట్ ఎన్నికల్లో పది స్థానాలకు గాను విపక్ష కూటమి 5 స్థానాల్లో విజయం సాధించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం పది స్థానాలనూ బీజేపీ గెలుచుకుంది. పంజాబ్‌లో కాంగ్రెస్ పరిస్థితి మెరుగవడంతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది సత్తా చాటాలని కాషాయ పార్టీని మట్టికరిపించాలని రాహుల్ గాంధీ కసరత్తు సాగిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్‌తో పొత్తు విషయంలో ఆప్ ఇంకా ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. మనీల్యాండరింగ్ కేసులో ప్రస్తుతం జైలులో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో సంప్రదించిన మీదట ఈ దిశగా తుది నిర్ణయం తీసుకుంటామని ఆప్ ఎంపీ, ఆ పార్టీ సీనియర్ నేత సంజయ్ సింగ్ తెలిపారు.



## 'అపరాజిత' బిల్లుకు బెంగాల్ అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌లో ట్రయినీ వైద్యురాలి హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టించిన నేపథ్యంలో అత్యాచారం, హత్య కేసుల్లో దోషులకు మరణదండన విధించేందుకు ఉద్దేశించిన 'అపరాజిత ఉమన్ అండ్ చైల్డ్ బిల్లు (వెస్ట్ బెంగాల్ క్రిమినల్ లాస్ అండ్ ఎమెండమెంట్)–2024ను బెంగాల్ ప్రభుత్వం అసెంబ్లీలో మంగళవారం ప్రవేశపెట్టింది. చర్చ అనంతరం దీనికి సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇది 'చరిత్రాత్మక బిల్లు' అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసెంబ్లీలో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. అత్యాచారం, లైంగిక నేరాలపై కొత్త ప్రొవిజన్స్‌తో రూపొందించిన ఈ బిల్లు మహిళలు, పిల్లలకు మరింత రక్షణ కల్పిస్తుందని అన్నారు.



బిల్లుపై చర్యలో మమతా బెనర్జీ మాట్లాడుతూ, అత్యాచారాలు మానవత్వానికి మాయని మచ్చ అని, అలాంటి నేరాలకు అట్టుకట్ట వేసేందుకు సామాజిక సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని మమతా బెనర్జీ అన్నారు. అపరాజిత బిల్లుపై సంతకం చేయాలని విపక్షాలు గవర్నర్ సీవీ ఆనంద బోస్‌ను కోరాలని సూచించారు. అనంతరం చట్టంగా తీసుకు వచ్చే బాధ్యత మనపై ఉందన్నారు. సీబీఐ నుంచి న్యాయం కోరుతున్నామని, దోషులకు మరణశిక్ష విధించాలని తాము కోరుతున్నామని చెప్పారు. 'అపరాజిత' బిల్లుతో సత్వర విచారణ, బాధితులకు న్యాయ లభిస్తుందన్నారు. బిల్లు పాస్ కాగానే ప్రత్యేక అపరాజిత టాస్క్‌ఫోరస్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కోల్‌కతా ట్రయినీ డాక్టర్ మృతికి నివాళి అర్పించారు. కాగా, బిల్లుకు ప్రధాన విపక్షమైన బీజేపీ మద్దతు ప్రకటించింది. లా కమిటీ వద్దకు బిల్లు వెళ్లిందో లేదో తమకు తెలియని, అయితే బిల్లు తక్షణం అమలు కావాలని తాము కోరుతున్నామని, తక్షణ ఫలితాలు ఆశిస్తున్నామని, బిల్లుకు తమ మద్దతు ఉంటుందని అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో విపక్ష నేత సువేందు అధికారి చెప్పారు.

## ఆధారాలను ధ్వంసం చేస్తే దోషిని ఎలా నిర్ధారిస్తారు..? : దీదీపై సువేందు అధికారి ఫైర్

ఆర్జీ కర్ ఆస్పత్రిలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు ప్రధాన కారణం పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీయేనని బెంగాల్ అసెంబ్లీలో విపక్ష నేత సువేందు అధికారి ఆరోపించారు. మమతా బెనర్జీ తక్షణమే సీఎం పదవి నుంచి వైదొలగాలని ఆయన డిమాండ్ చేశారు. ఆధారాలు ధ్వంసం చేస్తే దోషిని ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించారు. కోల్‌కతా ఘటనకు నిరసనగా 5000 మందికి పైగా మహిళలు వీధుల్లోకి వచ్చారని, ఈ ప్రదర్శనకు తాము మద్దతు ప్రకటించామని సువేందు అధికారి తెలిపారు. ఆర్జీ కర్ సోదరి విషాదాంతానికి దీదీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కాగా పశ్చిమ బెంగాల్ సాంస్కృతిక, సారస్వత ఫోరం ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మహిళలు ఆర్జీ కర్ ఘటనకు వ్యతిరేకంగా కోల్‌కతాలో మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు.కాగా, కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా పెనుదుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు వ్యతిరేకంగా కోల్‌కతాలో విపక్షాలు, మహిళా, ప్రజా సంఘాల నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. మరోవైపు మహిళలపై నేరాలకు చెక్ పెడుతూ కఠిన చట్టాన్ని తీసుకురావాలని కోరుతూ తాను ప్రధాని నరేంద్ర మోదీకి రెండు లేఖలు రాసినా ఎలాంటి స్పందన లేదని మమతా బెనర్జీ బెంగాల్ అసెంబ్లీలో పేర్కొన్నారు. తన లేఖలపై మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచీ, కేంద్ర ప్రభుత్వం నుంచీ సమాధానం రాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



# ప్రాణనష్టం తగ్గించగలిగాం

-మొదటిపేజీ తరువాయి

చెరువుల ఆక్రమణకు సహకరించిన అధికారులపైన చర్యలు తీసుకోవాలని అన్నారు. చెరువులు, నాలాల ఆక్రమణల జాబితా సిద్ధం చేయాలి. మాజీ మంత్రి ఆక్రమణ వల్లనే ఖమ్మంలో వరదలు వచ్చాయనే ఫిర్యాదులు వచ్చాయి. అమెరికాలో జల్సాలో మునిగి తేలుతున్న ఆయన.. ప్రభుత్వం పైన విమర్శలు చేస్తున్నడు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్లుగా హరీష్ రావు ఖమ్మం పర్యటనకు పోయిండు. ఖమ్మం మాజీ మంత్రి ఆక్రమణలపైన తొలగింపునకు హరీష్ రావు సహకరిస్తారా? 28 సెంటిమీటర్ల వర్షం కురిసినప్పటికీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. అయినా ప్రాణ నష్టం జరగడం బాధాకరం. జిల్లాలో నలుగురు చనిపోయారు. అందులో ఇద్దరు ఈ జిల్లా వాసులు, మరో ఇద్దరు ఖమ్మం జిల్లా వాసులు ఉన్నారు. మహబూబాబాద్ జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 680 మందికి పునరావాసం కల్పించాం. సీతారామ తండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డ ఎస్సై నగేష్ కి అభినందనలు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తాం. ఆకేరు వాగు వరద బారిన పడుతున్న 3 తండాలను ఒకే ప్రాంతానికి తరలించి అదర్శ కాలనీ నిర్మించాలని కలెక్టర్ కు ఆదేశించాం. పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి రూ.10 వేల సాయం అందిస్తాం. తెలంగాణలో వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధానికి లేఖ రాశాం. జరిగిన



నష్టాన్ని పరిశీలించడానికి రాష్ట్రానికి రావాలని ప్రధాన మంత్రిని కోరుతున్నాం. వరదతో చేరిన బురదను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. నష్టం జరిగిన ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఇతర ప్రాంతాల నుంచి అధికారులను రప్పించుకోవాలి. కూలిపోయిన విద్యుత్ లైన్లను తక్షణమే పునరుద్ధరించాలి. వరద ప్రమాద ప్రాంతాలు, ప్రమాదానికి కారణాలు, వాటిని ఎదుర్కొన్న తీరుపైబ్లూబుక్ ను తయారు చేసుకోవాలి. వాటిని కలెక్టరేట్లలో ఉంచాలి. వరదలు వచ్చినప్పుడు కేసీఆర్ పదేళ్లలో ఎప్పుడైనా పరామర్శకు వచ్చారా..? మాసాయిపేటలో పసిపిల్లలు చనిపోతే కేసీఆర్ పరామర్శించలేదు. హైదరాబాద్ శివారులో పశు వైద్యురాలిని హత్యచేస్తే వెళ్లి చూడలేదు. మానవత్వం లేని మనిషి కేసీఆర్. ప్రతిపక్ష నేత ఎక్కడున్నాడు? ఎందుకు మాట్లాడటం లేదు? స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితులకు సాయం కోసం ముందుకు రావాలి" అని రేవంత్ రెడ్డి పిలుపు ఇచ్చారు.

**ఎవ్వరిని వదిలిపెట్టం**

ఎక్కడికక్కడ వరద సమస్యలు పరిష్కరించేలా.. కలెక్టర్లకు, ఇంచార్జ్ మంత్రులకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వరదలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు దెబ్బతిన్నాయని.. ప్రాణనష్టం తగ్గించగలిగామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులను అభినందిస్తున్నానన్నారు. వరద బాధితులకు సహాయక చర్యలు కొనసాగుతాయని.. 30 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు అంచనా అందిందన్నారు.కాగా.. రాష్ట్రంలో ఆక్రమణలపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హైడ్రా తరహా వ్యవస్థను జిల్లాలకు కూడా విస్తరిస్తామన్నారు. అలాంటి వ్యవస్థతోనే కఠిన చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు సూచించారు. ఎవరెన్ని మాట్లాడినా ఆక్రమణలకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందేన్నారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా హైడ్రా ముందుకు వెళ్తుందన్నారు. చెరువుల కబ్జాలతోనే ఈ ప్రకృతి వైపరీత్యమని.. చెరువులు, కుంటల కబ్జాలపై చర్యలు తప్పవు అంటూ హెచ్చరించారు. నాలాల ఆక్రమణలను ఉపేక్షించేదిలేదని.. కబ్జాలు, ఆక్రమణలు చేసేవారు ఎంతటివారైనా వదిలేదిలేదంటూ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంచేశారు.

# వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్

-మొదటిపేజీ తరువాయి

చర్యలు పరిశీలించేందుకు వచ్చాం. పాలేరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి సహాయం అందించారు. పువ్వాడ అజయ్ ఖమ్మంలో ఆయా డివిజన్ల ప్రజలకు నిత్యావసరాలు అందిస్తున్నారు. ఖమ్మం ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని ముందుకు వచ్చాం. వార్డుల్లో ప్రజలను కలుస్తుంటే పరిస్థితి హృదయ విదారకంగా ఉంది. కళ్లల్లో నీళ్లు పెట్టుకుంటున్నారు. పసి పిల్లలకు పాలు దొరకక బాధపడుతున్నారు. తాగడానికి మంచినీళ్లు లేవు.. నిత్యావసరాలు అందించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని తమ ఆవేదన వ్యక్తం చేశారని హరీశ్‌రావు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముందుస్తుగా మైక్‌లో అనౌన్స్ చేసి అలర్ట్‌గా బయటకు తీసుకెళ్లారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి సహకారం అందిందింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలను అలర్ట్ చేయలేకపోయారు. వారి ప్రాణాలను కూడా కాపాడుకోలేకపోయింది. 9 మంది ఎమ్మెల్యేలను గెలిపించినా కూడా 9 మందిని కాపాడాలేకపోయారు. కనీసం హెలికాప్టర్‌ను కూడా పంపలేకపోయారు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

**సీఎం రేవంత్ రెడ్డికి వ్యంగ్యం ఎక్కువ.. పనితనం తక్కువ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యంగ్యం ఎక్కువ, పనితనం తక్కువ అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఖమ్మంలో 9 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే 9 మంది ప్రాణాలు కూడా కాపాడలేకపోయారు. వాతావరణ శాఖ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించిన ప్రభుత్వం పట్టించుకోలేదు అని ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఎక్కడా చూడు వ్యంగమే.. పాలనపై రేవంత్ రెడ్డి పట్టు కోల్పోయారు. చీటిమాటికి ప్రతిపక్షాలపై బురద జల్లుతున్నారు. ఇంకా మొద్దు నిద్ర నుంచి మేల్కొనలేదు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున వర్షాలు పడబోతున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించినా ప్రభుత్వం ముందుస్తు చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం భారీగా జరిగింది. దాదాపు ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షల వరకు నష్టం జరిగింది. కట్టుబట్టలతో బయటపడ్డామని వరద బాధితులు ఆవేదన చెందుతున్నారు. సర్టిఫికెట్లు, బియ్యం, నిత్యావసర వస్తువులు తడిసిపోయాయని కన్నీరుమున్నీరు అవుతున్నారు. కష్టపడి సంపాదించుకున్న బంగారం కొట్టుకుపోయిందం



టున్నారు. 12 గంటల పాటు తాగడానికి నీళ్లు లేక విలవిలలాడిపోయారట. రెండు రోజుల నుంచి తినడానికి తిండి లేదని బాధపడుతున్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం అని హరీశ్‌రావు మండిపడ్డారు. చనిపోయిన కుటుంబాలకు రూ. 25 లక్షలు ఇవ్వాలని ఇదే రేవంత్, సీతక్క ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అడిగారు. ఆ మాట ప్రకారం తక్షణమే చనిపోయిన కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వండి. మాట మీద నిలబడాలని డిమాండ్ చేస్తున్నాం. వరదలో పూర్తిగా మునిగిన ఇండ్లకు తక్షణమే రూ. 2 లక్షలు సాయం చేయాలని కోరుతున్నాం. మీరు ఇచ్చే రూ. పది వేలు ఏ మూలకు సరిపోవు.. దయచేసి ఆదుకోండి.. పిల్లల సర్టిఫికెట్లు తడిసి ముద్దయ్యాయి.. వారందరికి ఉచితంగా సర్టిఫికెట్లు అందజేయాలని డిమాండ్ చేస్తున్నాం. బియ్యం ఇచ్చినా వండుకొనే పరిస్థితి లేదన్నారు. ఇంట్లో బురద ఉన్నాక ఎలా వండుకుంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివాళాకోరు ప్రభుత్వం ఇది. రేవంత్ రెడ్డికి వ్యంగం ఎక్కువ.. మోకాలికి, బోడిగుండుకు లింక్ పెట్టి పిచ్చి మాటలు మాట్లాడే ప్రయత్నం చేస్తున్నాడని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. వరద సహాయక చర్యల్లో కేంద్రం కూడా విఫలమైంది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను, హెలికాప్టర్లను పంపలేకపోయింది. ప్రజల ప్రాణాలను కాపాడడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. సీఎంను డిమాండ్ చేస్తున్నాం.. అఖిలపక్షాన్ని ఢిల్లీకీ తీసుకెళ్లాలి. మోదీని నిలదీద్దాం.. సహాయం ఎందుకు చేయరో అడుగుదాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల ప్రజలు బలయ్యారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**వరదలకు చనిపోయిన వారి విషయంలోనూ రేవంత్ అబద్ధాలు.. మండిపడ్డ హరీశ్‌రావు**

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలకు చనిపోయిన వారి విషయంలోనూ సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. చనిపోయిన వారి విషయంలో సంఖ్య తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి 16 మంది చనిపోయినట్టు చెప్పారు. కానీ మా వద్ద స్పష్టంగా వివరాలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలకు, వరదలకు 30 మంది చనిపోయిన వారి వివరాలు ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 మంది, మహబూబాబాద్‌లో 3, సూర్యాపేటలో ఇద్దరు, , ములుగులో ఇద్దరు, ఆదిలాబాద్‌లో ఒక్కరు, నారాయణపేటలో ఇద్దరు, నాగర్‌కర్నూల్‌లో గుర్తు తెలియని డెడ్ బాడీ దొరికింది. వనపర్తిలో ఒకరు, పెద్దపల్లిలో ఇద్దరు, కామారెడ్డిలో ఒకరు, సిద్దిపేటలో ఇద్దరు, రంగారెడ్డిలో ఇద్దరు చనిపోయారు. ప్రభుత్వం ఏమో 16 మంది అని చెబుతున్నారు. మరణాల విషయంలోనూ ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని హరీశ్‌రావు మండిపడ్డారు. భక్తరామదాసు, పాలమూరు ఎత్తిపోతల పంప్ హౌస్‌లు నీట మునిగాయి. దీనికి పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. 2 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ప్రభుత్వ యంత్రాంగం సకాలంలో స్పందించి ఉంటే వేల ఎకరాల్లో పంట నష్టం జరిగి ఉండకపోయేది. నష్టపోయిన పంటకు ఎకరానికి రూ. 30 వేలు ఇవ్వాలని గతంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రతి ఎకరాకు రూ. 30 వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. మీ తప్పిదం వల్ల సాగర్ కెనాల్ తెగిపోయింది. రైతులు బాధపడుతున్నారు. కన్నీళ్లు పెట్టుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. అన్ని మేమే చేస్తే సీఎం కుర్చీలో నువ్వు ఎందుకు రేవంత్ రెడ్డి. రైతు రుణమాఫీ కాలేదంటే హరీష్ రావు ఇంటింటికి పోయి కాగితాలు జమచేసి తెచ్చి ఇవ్వాలంటాడు. కేంద్రం బడ్జెట్లో నిధులు కేటాయించకపోతే కేసీఆర్ వెళ్లి ఢిల్లీలో దీక్ష చేయాలంటాడు. వరదలు వచ్చినాయి సహాయం చేయండి అంటే బీఆర్ఎస్ వాళ్ళు చేయాలంటాడు. అన్ని మేమే చేస్తే సీఎం కుర్చీలో నువ్వు ఎందుకు రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు నిలదీశారు.

## వరద బాధితులకు కేంద్ర సాయం..

**హైదరాబాద్:** వరదల్లో చనిపోయిన వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 3లక్షలు వస్తాయని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన రూ. 5లక్షల్లో కేంద్రం ఇచ్చే రూ. 3లక్షలు కలుపుకొని ఇస్తారా? లేదా? రాష్ట్ర ప్రభుత్వమే రూ. 5లక్షలు ఇస్తోందా? అనే విషయంపై క్లారిటీ లేదని కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు (మంగళవారం) బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి.. వారం రోజుల కంటే ఎక్కువ రోజులు ఉంటే రూ. 16వేలు, వారం లోపుల ఆస్పత్రిలో ఉంటే రూ. 4 వేలను ఆస్పత్రి ఖర్చులకు కేంద్రం ఇస్తుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

ఎస్డీఆర్ఎఫ్ నిధులతో బాధితులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. యుటిలైజేషన్ నిధులపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇప్పటివరకు ఎలాంటి రిపోర్ట్ విడుదల చేయలేదని చెప్పారు. ఎస్డీఆర్ఎఫ్ కింద రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ. 1300 కోట్లకు పైగా నిధులు ఉన్నాయని తెలిపారు. మరో రూ. 200 కోట్లు యూసీ నిధులున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి నివేదిక సమర్పిస్తే కేంద్ర ప్రభుత్వం దానికి తగిన నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని కిషన్‌రెడ్డి తేల్చిచెప్పారు.

అంటు వ్యాధులు సోకకుండా మెడిసిన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17ఉత్సవాలపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శలు చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వమే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. 1948లో నిజాం లొంగిపోయిన రోజు... గణేష్ నిమజ్జనం ఒకేరోజు జరిగిందని చెప్పారు. మళ్లీ 75ఏళ్ల తర్వాత ఇది రిపేట్ అవ్వడం సంతోషమని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

# అత్యవసరమైతేనే బయిటకు రండి

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని వరద ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. హిమాయత్ సాగర్ జలాశయాన్ని మంత్రి పరిశీలించారు. మరో రోజు వర్షాలు పడినా హిమాయత్ సాగర్ జలాశయం నిండిపోతుందన్నారు. జలాయశయం నిండితే కింద ఉన్న ప్రాంతాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ,రంగారెడ్డి కలెక్టర్లకు ఆదేశించారు. మరో 5 వేల క్యూసెక్కుల నీళ్ళు వస్తే ఓవర్ ఫ్లో అవుతుందన్నారు. ప్రభుత్వం తరుపున అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తోందని వివరించారు. విపత్కార సమయంలో రాజకీయాలు చేయొద్దని ప్రతిపక్షాలను కోరారు. రాజకీయాలు అసెంబ్లీ వేదికగానో,ఎన్నికలు వచ్చినప్పుడు చూసుకుందామని సలహా ఇచ్చారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ఒకరు అమెరికాలో ఉండి ఒకరు ఫార్మ్ హౌస్‌లో ఉండి ట్విట్టర్ వేదికగా విమర్శలు చేయడం సరికాదని విమర్శించారు. విపత్తుల సమయంలో జరిగిన మరణాలు ప్రమాదవశాత్తు జరిగాయని తెలిపారు. ఎక్కడ కూడా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగినవి కావన్నారు. వారిని ఆదుకోవడానికి 5 లక్షల పరిహారం ఇస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు అందరినీ అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ యంత్రంగా 24 గంటలు పని చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని వివరించారు.జాతీయ విపత్తుగా గుర్తించి భారీగా నిధులు కేంద్రం రిలీజ్ చేసేలా బీజేపీ కృషి చేయాలని సూచించారు. తక్షణం సాయం కింద 2000 కోట్లు అందించేలా కేంద్రాన్ని ఒప్పించాలన్నారు. గతంలో ఇలాంటి ప్రకృతిలు వస్తే ప్రజలకు ఎలాంటి సాయం చేయని పరిస్థితి ఉండేదని ఆరోపించారు. కొండగట్టులో 69 మంది చనిపోతే కనీసం ఒక్కరూ కూడా వచ్చి పరమర్శించని దుస్థితి ఉండేదన్నారు. మానవీయ కోణం లేని బీఆర్ఎస్ నేతలు తమను విమర్శించడం ఏంటని నిలదీశారు.ముఖ్యమంత్రి ఖమ్మం వెళ్లి అక్కడ పర్యటించి రాత్రి అక్కడే ఉన్నారని గుర్తు చేశారు. ఉదయం మహబూబాబాద్ వచ్చారని పేర్కొన్నారు. అవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉత్తర తెలంగాణ జిల్లాలో రెడ్ అలెర్ట్ ప్రకటించిందని దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రయాణాలు పెట్టుకోవాలన్నారు. ఆయా జిల్లాల్లో పరిస్థితులను బట్టి పాఠశాలకు సెలవులు ప్రకటించాలని అధికారులకు సూచించారు. 33 జిల్లా కలెక్టర్లు, గ్రామ కార్యదర్శి మొదలు సిఎస్ వరకు అంతా రాత్రీపగలు పని చేస్తున్నారన్నారు.

**అధికారులు, నేతలంతా ప్రజల్లోనే...**

ఎక్కడైనా ఆపద ఉన్న విపత్తు కలిగితే కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు,ఎంపీలు అందరూ ప్రజల్లోనే ఉన్నారని వివరించారు. రాజకీయాలు అవసరం లేదన్న ఆయన... అందరూ ప్రజలకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. జరిగిన నష్టంపై కేంద్రాన్ని నిలదీద్దామన్న ఆయన... బడ్జెట్ లా మొండి చేయి చూపకుండా సహకరించాలన్నారు. ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది ప్రజలు ధైర్యంగా ఉండాలని సూచించారు.

## ఆరువేల కోట్లనష్టం

**, శుభ తెలంగాణ**

నామరూపాల్లేకుండా చేశాయి. పంట పొలాలు నదులను తలపిస్తున్నాయి. భవనాల్లోని రెండో అంతస్తుల్లోకి నీరు వచ్చి చేరింది. చెరువులకు చాలా ప్రాంతాల్ల గండ్లు పడ్డాయి. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా విధ్వంసం జరిగిందని ప్రభుత్వం చెబుతోంది. బాధిత ప్రజలు కోలుకున్న తర్వాత వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల బృందాలు పర్యటించి నష్టాన్ని అంచనా వేయనున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాల్లో ప్రధానమైంది పంట నష్టాలు. సమారు నాలుగున్నర లక్షల ఎకరాల్లో పంటలు నీటమునిగినట్టు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇది ప్రాథమిక అంచనా మాత్రమేనని ఇంకా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తే మాత్రం ఇది మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన నాలుగున్నర కోట్లపైగానే నిధులు కావాల్సి ఉంటుంది. వరద నష్టాల్లో ఇది ప్రధానమైంది. వరద నష్టాల్లో రెండో ప్రధానమైంది దెబ్బతిన్న భవనాలు. ఇప్పుడు చాలా మంది ప్రజల ఇళ్లు నేలమట్టమయ్యాయి. మరికొన్ని నీట మునిగి దెబ్బతిన్నాయి. వాటిని గుర్తించి వారికి పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. దీనిపై కూడా ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చింది. ఇలా దెబ్బతిన్న భవనాల్లో ప్రభుత్వ భవనాలు కూడా ఉంటాయి. ఇవి మాత్రం నేరుగా వెళ్లి పరిశీలించిన తర్వాత అంచనాకు రాగలమని అధికారులు చెబుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో భారీగా రోడ్లు దెబ్బతిన్నాయి. దాదాపు దీని నష్టం రెండువేల కోట్లకుపైగానే ఉంటుందని, వంతెనలు మరో ఏడు వందల కోట్లు నష్టం జరిగి ఉంటుందని అంటున్నారు. పంచాయతీ రోడ్లు, మిషన్ భగీరథ పైపులైన్ల పునరుద్ధరణకు దాదాపు 200 కోట్లు అవసరం అవుతాయని అధికారులు లెక్కగడుతున్నారు. వరదల కారణంగా ట్రాన్స్‌కోకు భారీ నష్టం వాటిల్లింది. ఎక్కడికక్కడ వైర్లు తెగిపడ్డాయి. స్తంభాలు కూలిపోయాలి. ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతిన్నాయి. విద్యుత్ సబ్‌స్టేషన్లు కూడా నీట మునిగిపోయాయి. ఈ రిపేర్ల కోసం దాదాపు 150 కోట్లకుపైగానే నిధులు అవసరం అవుతాయి.వీటితోపాటు ఆసుపత్రుల్లో జరిగినష్టం, వీధిలైట్లు, డ్రైనేజీలు, ఇతర నష్టాలు దాదాపు 15 వందల కోట్లకుపైగానే ఉండొచ్చని ప్రాథమికంగా అంచనాకు వస్తున్నారు అధికారులు. ఓవరాల్‌గా చూసుకుంటే మాత్రం ఆరు వేల కోట్ల వరకు నష్టాన్ని ఇప్పటికి అంచనా వేస్తున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. వాతావరణ హెచ్చరికలతో అప్రమత్తమై ప్రాణ నష్టాన్ని తగ్గించగలిగామని ఆస్తి నష్టాన్ని మాత్రం తగ్గించలేకపోయామని అంటున్నారు. వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులను యుద్ధప్రాతిపదికన అధికారులు పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాలకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. రైల్వే ట్రాక్‌లను కూడా పునరుద్ధరించారు. కేసముద్ర మండలం తాళ్లపూసపల్లి, ఇంటికన్నె వద్ద దెబ్బతిన్న రైల్వే ట్రాక్‌ను పునర్‌నిర్మించే పనులు విస్తృతంగా సాగుతున్నాయి. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం వద్ద దెబ్బతిన్న పాలేరు బ్రిడ్జిని రిపేర్ చేసి రాకపోకలకు అనుమతిచ్చారు. దీన్ని గంటల వ్యవధిలోనే పూర్తి చేశారు. అయితే ఇంకా కొన్ని ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కుమ్రంభీం జిల్లాలో తెలంగాణ- మహారాష్ట్ర నేషనల్హైవే పెనుగంగా నది నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆదిలాబాద్ జిల్లాలో కూడా చాలా ప్రాంతాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. వీటి పనులను కూడా యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు.

## పథకం ప్రకారమే మాపై దాడి




**ఖమ్మం :** ఖమ్మం ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న మాజీ మంత్రులపై కొంతమంది వ్యక్తులు దాడి చేశారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వాహనంపై రాళ్లతో దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో బీఆర్ఎస్ నేతలకు గాయాలు అయ్యాయి. ఈ ఘటనను మాజీ మంత్రులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్టంలో పాలన బాగోలేగదని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఖమ్మంలో ప్రజలకు న్యాయం చేయడానికి వచ్చామని... ఇది ప్రభుత్వ వైఫల్యం అని బాధితులు చెబుతున్నారన్నారు. ఈరోజు పథకం ప్రకారం తమపై దాడి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ గుండాలు పోలీసుల ముందే దాడి చేశారన్నారన్నారు. దాడి చేసిన గుండాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. " మంత్రులు నీతులు చెపుతారు. జరిగిన దాడిపై ఖండించండి" అని అన్నారు. వరద వచ్చినా మంత్రులు నిద్రలోనే ఉన్నారంటూ విరుచుకుపడ్డారు. ప్రజలు చెపితేనే లేచారన్నారు. ఇక్కడ ప్రజలకు అన్యాయం జరిగిందని నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలను ఈ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. "ప్రతిపక్షాలు రావాలని సహాయం చేయాలంటారు. వచ్చిన మాపై దాడి చేస్తారా. మీ వైఫల్యం దాచడానికి ఈ చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. మమ్మలను బెదిరించలేరు. ప్రజల చేత మీకు బుద్ది చెప్పిస్తాం. పోలీస్ అధికారులు దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి. బీఆర్ఎస్ కార్యకర్తలు ఇలాంటివి చిల్లర వాటిని పట్టించుకోవద్దు" అంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సూచించారు.

**ప్రతిపక్షంగా మేము చేయాల్సిన బాధ్యత మాపై ఉంది**

"ఖమ్మం ప్రజలు మూడు రోజులుగా అల్లడుతున్నారు..ప్రతిపక్షంగా మా పని.. మేము చేయాల్సిన బాధ్యత మాపై ఉంది" అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. వరద బాధితులకు సహాయం చేయడానికి బీఆర్ఎస్ నాయకులు వచ్చారని తెలిపారు. వచ్చిన పని వదిలేసి ప్రతిపక్షంపై బురద జల్లుతూ వరద బాధితులను కాంగ్రెస్ నేతలు మరిచారని మండిపడ్డారు. "కాంగ్రెస్ గుండాలతో మాపై హత్యాయత్నం చేయించారు. మాపై దాడికి మంత్రులదే బాధ్యత. దాడి కారణమైన వారిపై సిపికి ఫిర్యాదు చేస్తాం. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. పోలీసులకు పిర్యాదు చేస్తాం. ఉద్యమం నడిపిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉంది. మాపై దాడి జరిగింది చర్యలు తీసుకోవాలి. వరద బాధితులను ఆదుకోవాలి" అని డిమాండ్ చేశారు. హరీష్‌రావు మాట్లాడుతూ.. ఈరోజు ఖమ్మంలో జరిగిన దాడిని డీజీపీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీతో సంబంధాలు ఉన్నాయి కాబట్టి కేంద్ర సాయం కోసం గట్టిగా నిలదీయలేకపోతున్నారని విమర్శించారు. ఇంత విపత్తు జరిగిన కేంద్రాన్ని రేవంత్ ఎందుకు నిలదీయడం లేదని హరీష్‌రావు ప్రశ్నించారు.

## ఔటర్ రింగ్ రోడ్డులోని 51 గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేస్తు ఆర్డినెన్స్




హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 51 గ్రామాలను ఆయా మున్సిపాలిటీలలో విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. ఒక్కో మున్సిపాలిటీలో ఒకటి నుంచి ఆరు వరకు గ్రామాలను విలీనం చేసింది. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని పలు గ్రామాలు ఈ విలీనమైన జాబితాలో ఉన్నాయి. పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీలో నాలుగు గ్రామాలు, శంషాబాద్‌లో ఆరు, నార్సింగి, తుక్కుగూడలలో ఒక్కో పంచాయతీ, మేడ్చల్‌లో రెండు, దమ్మాయిగూడలో ఆరు, నాగారంలో ఐదు, పోచారంలో ఐదు, ఘట్‌కేసర్‌లో ఆరు, గుండ్లపోచంపల్లిలో రెండు, తూంకుంట మున్సిపాలిటీలో మూడు పంచాయతీలను విలీనం చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది.

## విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

రాష్ట్ర విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్, ముగ్గురు సభ్యులతో ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయనుంది. ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర పాలసీ తయారీలో ఈ కమిషన్ కీలక పాత్ర పోషించనుంది. చైర్మన్, సభ్యులను త్వరలో నియమిస్తామని ప్రభుత్వం తెలిపింది. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా ఈరోజు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# ఖమ్మం వరద బీభత్సానికి అసలు కారణమిదే..!

**-వరద నీరు వెళ్లేదారి లేకనే..**
**-అధికారుల తప్పిదాలు, అక్రమార్కుల అత్యాశ**
**-ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో భవంతుల కట్టడాలు**
**-డ్రెయినేజీలు మూసి నిర్మాణాలు, రోడ్లపైకి ర్యాంపులు**
**-నాలాలు మూసేసి నిర్మాణాలు**



**ఖమ్మం, శుభ తెలంగాణ:** నిన్న మొన్నటివరకు సుందరీకరణకు మారుపేరుగా ఉన్న ఖమ్మం నగరం ఒక్కరాత్రిలోనే మురికి కూపంగా మారింది. రెండు తెలుగురాష్ట్రాల రాకపోకలకు కేంద్రబిందువుగా ఉన్న జిల్లా కేంద్రం ఒక్కరోజు కురిసిన వర్షానికే జలదిగ్భంధం అయింది. నగర పాలక సంస్థ పరిధిలోని ఒకటి, రెండు డివిజన్లు మినహా మిగిలిన అన్నీ ప్రాంతాల్లో మోకాళ్లలోతు నీళ్లు నిలిచి జనజీవనం స్తంభించింది. అయితే ఖమ్మం అర్బన్ పరిధిలో శనివారం కురిసిన వర్షం కంటే కూడా పెద్దఎత్తున వర్షపాతం నమోదైన సంఘటనలు బోలెడున్నాయి. కానీ ఆయా సమయాల్లో ఎన్నడూ లేనివిధంగా నగర పాలక సంస్థ పరిధిలోని పదులకొద్దీ డివిజన్లు ముంపునకు ఎందుకు గురవుతున్నాయనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మున్నేరు బ్రిడ్జిలపై నుంచి నీళ్లు పొంగేస్థాయిలో వరద రావడం ఇది నాలుగోసారి కాగా, ఆ నాలుగుసార్లు కూడా ఇదే రకమైన పరిస్థితులు నెలకొనడంతోపాటు యేటికేడు వరద ముప్పు తీవ్రతరమవుతున్నట్టుగా తెలుస్తోంది. కాగా గతంలో అంతకుమించిన వర్షాలు పడిన సమయంలో కొద్దిగొప్ప నష్టం ఉన్నప్పటికీ ఇంతటిస్థాయిలో జననివాసాలు ముంపునకు గురవడం గడిచిన రెండేళ్ల కాలంగానే జరుగుతున్నట్టుగా తెలుస్తోంది.

### వరద వెళ్లేదారిలేకనే ముంపు

ప్రస్తుతం కురిసిన వర్షాలతో ఖమ్మం నగరం అతలాకుతలమైన పరిస్థితులు నెలకొన్నాయి. వాస్తవానికి మున్నేరుకు వరద పెరిగిన సమయంలో మున్నేరు నదీ ప్రవాహానికి సమీపంలో ఉన్న ప్రాంతాలు మాత్రమే ప్రభావితమయ్యేవి. కానీ గతేడాది వర్షాలు కురిసిన సమయంలో ఖమ్మం నగరంలోని మరికొన్ని ప్రాంతాలకు వరద నీరు చేరుకుని ఇళ్లల్లో నీళ్లు నిలిచిపోయాయి. కాగా శనివారం కురిసిన వర్షాలకు మాత్రం ఖమ్మం నగరం మొత్తం వరదనీటితో నిండిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మున్నేరు నదీ ప్రవాహానికి చేరువలో ఉన్న దానవాయిగూడెం, రామన్నపేట, మోతీనగర్, వెంకటేశ్వరనగర్, రంగనాయకులగుట్ట, ప్రకాష్‌నగర్, బొక్కలగడ్డ, పద్మావతినగర్ ప్రాంతాలు పూర్తిగా నీటమునిగిపోయాయి. ఆయా ప్రాంతాల్లో రెండు, మూడు ఫ్లోర్లు ఇళ్లు మొత్తం కనిపించని పరిస్థితి ఏర్పడింది.

### ఇదే అసలు కారణం..

వాటన్నింటికీ కారణంగా మున్నేరు తీవ్రంగా ప్రవహించడంతో వరదనీరు కలిసే అవకాశం లేని కారణాన్ని కొందరు చెబుతున్నప్పటికీ.. ఎగువనుంచి ఎగబాకిన వరదనీరు వెళ్లేదారిలేకపోవడంతో దిగువన ఉన్న ప్రాంతాలన్నీ ముంపునకు గురయ్యాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రఘునాథపాలెం నుంచి బల్లేపల్లి, పాండురంగాపురం, అమరావతినగర్, విద్యానగర్ నుంచి వచ్చే వరదనీరు మొత్తం ఖానాపురం చెరువుమీదుగా లకారం మీదుగా మున్నేరులో కలవాల్సి ఉంటుంది. మిగిలిన ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు సైతం ఇదేరీతిలో బయటకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఆ దారులన్నీ మూసివేసిన కారణంగా ఎక్కడి నీరు అక్కడే నిలిచి ఇళ్లకు ఎగబాకినట్టు తెలుస్తోంది. అయితే ఇంతటిస్థాయిలో నష్టం జరగడానికి కారణం సుందరీకరణ పేరుతో పార్కులు ఏర్పాటు చేసి వరద వెళ్లేందుకు దారిలేకుండా అడ్డుకట్ట వేయడం కూడా కారణమేనంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

### బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లలో నిర్మాణాలు..

మున్నేరు నది, ఖానాపురం, లకారం వంటి చెరువులు, ఆయా చెరువులకు అనుసంధానంగా చైన్‌లింక్ కాల్వల పరిధిలో ఎలాంటి భూములున్నా సరే.. వాటికి సంబంధించి క్రయ విక్రయాలు సాగకూడదు. ఆయా ప్రాంతాల్లో వెంచర్లకు, ప్లాట్లకు సంబంధించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి అనుమతులు నిషేధం. కానీ సాధారణ భూములకు మాదిరే అన్నీ రకాల పనులు సాగించారు. అక్కడ ఎలాంటి నిర్మాణాలు జరగకుండా అడ్డుకోవాల్సిన అధికారులు భూముల రిజిస్ట్రేషన్ల నుంచి మొదలుకుని ఇళ్ల నిర్మాణాలు, వాటికి అనుమతులు సైతం మంజూరుచేశారు. ఆయా అక్రమ నిర్మాణాల కారణంగా ఇలాంటి వరదలు వచ్చినప్పుడు ఆయా ఇళ్లకు నీరు పోటెత్తడం పరిపాటిగా మారిందన్న విమర్శలు లేకపోలేదు.

### డ్రెయినేజీలు మూసేసి..

మున్నేరు పరివాహక ప్రాంతంలోని బఫర్‌జోన్‌లో, ఎఫ్‌టీఎల్‌లలో జోరుగా భవంతులు నిర్మాణాలు జరగ్గా.. నగరంలో సైతం అదేరీతిలో కాల్వలను కబ్జాచేసి మరీ నిర్మాణాలు చేపట్టారు. భారీ ఎత్తున అపార్ట్‌మెంట్లు నిర్మించారు. పలు అపార్ట్‌మెంట్లలో అండర్‌గ్రౌండ్ పేరుతో లోపలికి వెళ్లిన వరదనీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా సెల్లార్లు నిర్మించారు. డ్రెయినేజీలను ఆక్రమించి రోడ్లపైకి నిర్మాణాలు చేశారు. పెద్ద ఎత్తున ర్యాంపులు వేసి డ్రెయినేజీలు మూసేశారు. కొన్ని ప్రాంతాల్లో అయితే మాస్టర్‌ప్లాన్‌లో బఫర్‌జోన్‌లో ఉన్న స్థలాలకు సైతం లోకేషన్లు మార్చి అనుమతులు మంజూరు చేసిన సంఘటనలు ఖమ్మం కార్పొరేషన్‌లో ఉన్నాయి. ఇవన్నీ ఇలా ఉండటంతోపాటు మిగిలిన వరదనీరు సైతం బయటకు వెళ్లేందుకు మార్గం లేక కట్టలు కట్టిన కారణంగా ఆయా డివిజన్లలో నీళ్లు నిలిచిపోయినట్టుగా తెలుస్తోంది.

### నిద్రలు లేకుండా..

ఫలితంగానే మంత్రుల నుంచి మొదలుకుని జిల్లాస్థాయి ఉన్నతాధికారులు సైతం నిద్రలు లేకుండా శ్రమించాల్సిన పరిస్థితులు ఏర్పడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వరదలు వచ్చిన సమయంలోనే వీటిపై దృష్టిసారిస్తే ప్రస్తుతం ఇంతటిస్థాయిలో నష్టం ఉండేదికాదన్న వాదన వినిపిస్తుంది. ఒక్క రాత్రి కురిసిన వర్షానికే ఖమ్మం నగరం పరిస్థితి ఇలా తయారైతే మున్ముందు భారీ ఎత్తున వర్షాలు పడితే ఎంతటిస్థాయిలో నష్టం జరుగుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

### బురదమయమైన బతుకులు

మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలకు ఏటా కన్నీటి కష్టాలు తప్పడం లేదు. భారీ వర్షాలు వరదల సమయంలో ముంచుకొస్తున్న ముప్పు గురిం చి అధికా రయంత్రాంగంతో పాటుగా తాము ఓట్లేసి గెలిపించిన ప్రజా ప్రతినిధులు కూడా కనీసం పది నిమిషాల ముందు కూడా సమాచారం ఇవ్వలేదని బాధితులు కన్నీరు పెట్టారు. ఆకస్మికంగా ఇంటిని చుట్టు ము ట్టిన వరదతో పిల్లలతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఇంటి నుంచి బ య పడ్డామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవ త్సరం కూ డా వరద వచ్చినా ఇంత స్థాయిలో నష్టం జరగ లేదన్నారు. మున్నేరు వర ద ప్రభావిత ప్రాంతాలని సోమవారం సందర్శించిన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులతో బాధితులు తమ బాధలను పంచుకున్నారు.

### వరద సమాచారం ఇవ్వలేదు : మోకాటి సుగుణ

మున్నేరుకు వరద వస్తుందని కనీస సమాచారం ఇవ్వలేదు. ఒక్కసారి గా వరద ఇంటిని చుట్టూ ముట్టటంతో కట్టుబట్టలతో ఇంటో నుంచి బయ టపడ్డాం. ఇంట్లో ఉన్న వస్తువులు వరదలో కొట్టుకు పోయాయి.

### తిండి గింజలు బురదలో కలిశాయి: కారంగుల కౌసల్య

ఒక్కసారిగా వరద రావటంతో ఇంట్లోని వస్తువులతో పాటు ఇంటి పైన రేకులు నీటిలో కొట్టుకుపోయాయి. బియ్యం, పప్పులు బురదలో కలిశాయి. మీమంతా కట్టుబట్టలతో మిగిలాం. రూ.4లక్షల వరకు నష్టపోయాం. ఇంటి రేకులు కొట్టుకుపోవటంతో రోడ్డుపైనే ఉంటున్నాం.

### చంటి బిడ్డతో బయపడ్డాం : వకజాల గోపిక

ఆకస్మికంగా వచ్చిన వరదలతో నెల రోజుల చంటి బిడ్డతో ఇంట్లో నుంచి బయటపడ్డాం. దండెం మీద దుస్తులు ఇంట్లోని సామగ్రి వరదలో కొట్టుకుపోయాయి. ఇద్దరు పిల్లలతో పునరావాస కేంద్రంలో తలదాచుకున్నాం. ఇంట్లో మాకేం మిగలలేదు.

### పిల్లలే మిగిలారు: యూ. యేసుకుమారి

మా ఇంట్లో నా భర్త, నేను, మా ఇద్దరు పిల్లలే మిగిలాం. ఇంట్లో నుంచి వరద ప్రవహించడంతో ఏమీ మిగల లేదు. ఇద్దరు పిల్లలను తీసుకొని పునరవాస కేంద్రంలో నేను ఉన్నా. నా భర్త మా ఇంట్లో చేరిన బురదను శుభ్రం చేసేందుకు వెళ్లారు. రూ.5లక్షలకు పైగా నష్టం వాటిల్లింది.

### దిక్కులేని పక్షులమయ్యాం: పరికపల్లి ఈరమ్మ

మున్నేరు వరదతో నేను, నా కూతురు ఆమె ఇద్దరు ఆడపిల్లలు దిక్కు లేని పక్షులమయ్యాం.. భర్తలేని నా కూతురు కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు ఆడపిల్లలను చదివిస్తోంది. వరద వస్తోందని గమనించే లోపే వర ద చుట్టుముట్టింది. కట్టుబట్టలతో బయటికొంచ్చాం. ఇంట్లోని వస్తువులన్నీ పనికిరాకుండా పోయాయి. పిల్లల పుస్తకాలు కూడా పోయాయి.

### మూడు కుటుంబాలను ముంచేసింది : అఫ్జల్ బీ

ఒక మాయలా వరద వచ్చి మూడు కుటుంబాలను ముంచేసింది. కూలి పనులు చేసుకొని పొట్ట పోసుకునే నేను నా ఇద్దరు కుమారులు ఒకే ఇంట్లో వేర్వేలు గదుల్లో ఉంటున్నాం. వరద మమ్మల్ని రోడ్డున పడేసింది. ఇంట్లోని సామగ్రి, బియ్యం పనికిరాకుండా పోయాయి. మాకు ఏ ఆధారమూ లేదు. మా పరిస్థితి ఏంటో అర్థం కావటం లేదు.

### కట్టుబట్టలు కన్నీళ్లే మిగిలాయి : ఎస్కే మన్నీ

మున్నేటి వరద మా కష్టార్జితాన్ని నీళ్ల పాలు చేసింది. కష్టించి కూడబెట్టుకున్న సామగ్రి నీటిపాలైంది. మంచాలు, ఫ్రిజ్, టీవీలు ఎందుకూ పనికి రాకుడా పోయాయి. కట్టుబట్టలతో మిగిలాం.. అని బాధితులు కన్నీరు పెట్టుకున్నారు..

# రాష్ట్రంలో విద్యారంగ స్థితి' రాష్ట్ర స్థితి, దయనీయంగా మారింది...

**-వికారాబాద్ నగర కార్యదర్శి మహేష్ సాగర్**

**వికారాబాద్, శుభ తెలంగాణ:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వికారాబాద్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా వికారాబాద్ నగర కార్యదర్శి మహేష్ సాగర్ మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆగస్టు 31, సెప్టెంబర్ 1 న రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు నల్లగొండలో జరిగాయి. ఈ సమావేశాలలో రాష్ట్రంలో ఉన్న ముఖ్యమైన కార్యకర్తలు అందరూ పాల్గొనడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్యలను ఈ కార్యక్రమంలో ఉన్న కార్యకర్తలు అందరూ చర్చించడం జరిగింది. అలాగే రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులపై రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో రాష్ట్ర స్థితి, విద్యారంగ స్థితి పై తీర్మానాలు ప్రవేశ పెట్టడం జరిగింది




తెలంగాణ రాష్ట్రంలో పాలకులు మారిన ప్రజల బ్రతుకులు మారడం లేదు. నియంత పోకడలు పోవడం లేదు. ముఖ్యంగా గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా విధ్వంసం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మరింత విధ్వంసానికి తెరలేపింది. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్న విద్యారంగానికి బడ్జెట్ కనీస నిధులు కేటాహించకుండా గతం కంటే తక్కువ (6.5%) కేటాయించడం అంటే ఈ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగంపై ఎంత చిత్తశుద్ధి ఉందో అవగతం అవుతుంది
పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ , స్కాలర్ షిప్స్ విడుదల చేయకుండా పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తుందని
రాష్ట్రంలో గురుకుల సంక్షేమ హాస్టల్స్ పరిస్థితి దయనీయంగా మారింది. సంక్షేమ హాస్టల్స్ సంక్షోభంలో కూరుకుపోయాయి. ప్రభుత్వాలు మారుతున్నా సంక్షేమ హాస్టల్స్ స్థితిగతులు మారడం లేదు. గురుకులాలు ప్రారంభమై యేండ్లు గడుస్తున్న రేషన్ మొదలు అన్ని వస్తువులలో కల్తీ, నాణ్యత లేని ఆహారం, నీళ్ల చారు, పురుగుల అన్నంతో గడిచిన ఏడు నెలల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. 500 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైనా ప్రభుత్వం కనీస విచారణ చేపట్టక పోవడం శోచనీయం అని అన్నారు.

డిమాండ్స్:-

1) పెండింగ్లో ఉన్న 7,500 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
2) ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు కల్పిస్తూ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి.
3) ఫీజు నియంత్రణ చట్టం అమలు చేసి కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యాపారాన్ని అరికట్టాలి.
4) ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మౌళిక వసతులు పెంచాలి. 'బి' కేటగిరి అడ్మీషన్స్ పేరుతో విద్యావ్యాపారాన్ని చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి. 'బి' కేటగిరి సీట్లను అన్లైన్లో భర్తీ చేయాలి.
5) గురుకుల, సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు పక్కా భావాలను నిర్మించాలి. మౌళిక వసతులు కల్పించాలి. మెస్ చార్జీలను పెంచి, నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందించాలి.
6) రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించాలి. ఖాళీగా ఉన్న అధ్యాపక అధ్యాపకేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలి..
7) అశాస్త్రీయంగా పెంచిన పీజీ, %ాష్త్రణ% కోర్సు ఫీజులను తగ్గించాలి.
8) అన్యాక్రాంతం అవుతున్న యూనివర్సిటీ భూములను కాపాడే విదంగా చట్టం తీసుకురావాలి.
9) అన్ని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్స్ లను రెగ్యులర్ చేయాలి
10) డైట్ కళాశాలతో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్స్ మరియు లెక్చరర్ లను భర్తీ చేయాలి.
11) రాష్ట్రము లో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలో అత్యాధునిక ల్యాబ్స్ మరియు వసతులు కల్పించి నాణ్యమైన వైద్య విద్యను అందించాలి.
12) విద్యాశాఖ మంత్రి నియమించాలి.
13) రైతు పండించి పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలి
14) మహిళలపై దాడులకు పాల్పడుతున్న దుండగులను కఠినంగా శిక్షించాలి ఆత్మరక్షణ విద్యను ప్రతి విద్యార్థినికి ప్రభుత్వం అందించాలి.
15) ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఎన్ని ప్రస్తుతం ఎంతమంది పనిచేస్తున్నారు ఎన్ని ఖాళీలు ఉన్నాయని శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు కార్తీక్, ప్రణీత్, నవీన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## జార?ండ్ రాష్ట్ర వార్ రూమ్ చైర్మన్ గా వికారాబాద్ వాసి సంతోష్ కుమార్ కుళ్ళుంద

**నియామక ఉత్తర్వులు జారీ చేసిన ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్**



**వికారాబాద్, శుభ తెలంగాణ:** వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన సంతోష్ కుమార్ కుళ్ళుంద ను త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే జార?ండ్ రాష్ట్ర ఎన్నికల వార్ రూమ్ చైర్మన్ గా ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సంతోష్ కుమార్ కుళ్ళుంద మాట్లాడుతూ రాబోయే జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి ఏఐసీసీ వరకు ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులను కోఆర్డినేట్ చేసుకుంటూ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని వివరించారు

## తెలుగు రాష్ట్రాలకు వెంకయ్యనాయుడు రూ.10 లక్షల సాయం..



**హైదరాబాద్, శుభ తెలంగాణ:** తెలుగు రాష్ట్రాల్లో వరదలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. తన పెన్షన్ నుంచి 2 రాష్ట్రాల సీఎం సహాయ నిధికి రూ.5 లక్షల చొప్పున పంపినట్లు తెలిపారు. అలాగే తన కుమారుడు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ముప్పవరపు ఫౌండేషన్ నుంచి రూ. 2.5 లక్షల చొప్పున, తన కుమార్తె దీపా వెంకట్ నిర్వహిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ నుంచి రూ. 2.5 లక్షల చొప్పున సాయం చేసినట్లు వెల్లడించారు.

## వర్షాల కారణంగా ఇబ్బంది పడ్డ రైతులను, ప్రజలను ఆదుకుంటాం...

**-స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**



**వికారాబాద్, శుభ తెలంగాణ:** అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను, ప్రజలను ఆదుకుంటామని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన వికారాబాద్ నియోజకవర్గం మోమిన్ పేట మండలంలో ఆయన జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ వర్షాలకు జిల్లాలో ఆరు ఇండ్లు కూలిపోయాయని, అదేవిధంగా నాలుగు పశువులు చనిపోయాయని ఆయన పేర్కొన్నారు. వాటికి ప్రభుత్వం తరఫున పరిహారం చెల్లింపు జరుగుతుందన్నారు. ఎక్కువగా రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలో వర్ష ప్రభావం ఉండడంతో అక్కడ తీవ్ర నష్టం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడ రెండు రోజులుగా పర్యటిస్తున్నారని ములుగులో సీతక్క పర్యటిస్తున్నారని తెలిపారు. వికారాబాద్ జిల్లాలో ఏ సమస్య వచ్చినా తాము ఆదుకుంటామని స్పష్టం చేశారు. మోమిన్ పెట్ మండలంలోని రామ్నాథ్ గుడిపల్లి ,గోవిందాపూర్,మల్ రెడ్డిగూడెం రైతులకు అవసరమయ్యే కత్వాలను రెండు మూడు నెలల్లో నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డీవో వాసు చంద్ర, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది రోగుల పట్ల సానుకూల దృక్పథంతో ఉండాలి...

**-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్**



**వికారాబాద్, శుభ తెలంగాణ:** మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్ నవాబ్ పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవల గురించి మెడికల్ ఆఫీసర్ ను మరియు పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది రోగుల పట్ల సానుకూల దృక్పథంతో ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫార్మసీ స్టోర్ లోని మందులను, లాబరేటరీని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం అవుట్ పేషంట్, ఇన్ పేషంట్ రిజిస్టర్ లను, వ్యాక్సిన్ నిల్వ ఉంచు %×ూ=% మరియు %ణవవజూ టతీవవఓవతీ% లను తనిఖీ చేశారు. వీటి నిర్వహణ పట్ల వైద్యాధికారి మరియు సిబ్బందికి తగు సూచనలు చేయడం జరిగింది. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆశా డే మీటింగ్ లో ఆశలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రజలకు అంటువ్యాధుల గురించి, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని మరియు గర్భవతులకు అన్ని రకాల పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గాని, జిల్లా ఆసుపత్రిలో గాని చేయించాలని సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీ.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ రోహిత్, సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విపత్తుకు విరాళాల వెల్లువ

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** ప్రజలకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా, విపత్తు ముంచెత్తినా... తమ వంతు సాయం చేయడానికి తెలుగు చలన చిత్ర పరిశ్రమ ప్రముఖులు ఎల్లప్పుడూ ఓ అడుగు ముందు ఉంటారు. ఏపీ, తెలంగాణలో భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద బాధితుల సహాయార్థం చేపట్టే చర్యల కోసం మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ కోటి రూపాయలు విరాళం ఇచ్చారు. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 50 లక్షలు, తెలంగాణ ముఖ్య మంత్రి సహాయ నిధికి మరొక 50 లక్షల రూపాయలు ఇచ్చారు. ఆయన తర్వాత మరికొందరు విరాళాలు ప్రకటిం చారు. మాటల మాంత్రికుడు, గురూజీ త్రివిక్రమ్ శ్రీనివాస్... ఆయనతో వరుసగా సినిమాలు నిర్మిస్తున్న హారిక అండ్ హాసిని క్రియేషన్స్ అధినేత సూర్యదేవర రాధాకృష్ణ (చిన బాబు), సూర్యదేవర నాగవంశీ 50 లక్షల రూపాయల విరాళం ప్రకటించారు. ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 25 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 25 లక్షలు ఇస్తున్నట్టు ఓ ప్రకటనలో తెలిపారు."భారీ వర్షాల వల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న భారీ ఆస్తి, ప్రాణ నష్టాలు మమ్మల్ని ఎంత గానో కలసి వేశాయి. ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడ్ని ప్రార్థిస్తూ... మా వంతు సాయంగా చేయూత అందిస్తున్నాం" అని త్రివిక్రమ్, చినబాబు, నాగవంశీ పేర్కొన్నారు.

**రెండు తెలుగు రాష్టాలకు రూ. 30 లక్షలు ప్రకటించిన సిద్ధూ**

'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్'తో పాటు పలు హిట్ సినిమాలు చేసిన యంగ్ హీరో, స్టార్ బాయ్ సిద్ధూ జొన్నలగడ్డ. ఏపీ, తెలంగాణ... రెండు తెలుగు రాష్ట్రాలకు ఆయన రూ. 30 లక్షల విరాళం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 15 లక్షలు, తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 15 లక్షలు విరాళం ప్రకటించారు. "ఇది కొంత మందికి అయినా ఏదో ఒక విధంగా ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను" అని చెప్పారు. మరో యువ కథానాయకుడు విశ్వక్ సేన్ ఏపీ, తెలంగాణకు ఐదేసి లక్షల చొప్పున విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. యువ కథానాయకుడు, ఎన్టీఆర్ వీరాభిమాని విశ్వక్ సేన్ సైతం ఏపీలో వరద విపత్తు సహాయక చర్యల కోసం ఐదు లక్షలు విరాళం ఇస్తున్నట్టు సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు. ఏపీకి ఐదు లక్షలతో పాటు తెలంగాణకు మరొక ఐదు లక్షల విరాళం ప్రకటించారు. మొత్తం మీద ఆయన పది లక్షలు ఇచ్చారు. ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ కు చెందిన వైజయంతి మూవీస్ రూ. 25 లక్షలు విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే.

# హాస్టల్ విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరవ్వాలి

**కరీంనగర్, శుభ తెలంగాణ :** వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరుకావాలని సరైన కారణం లేకుండా వారికి సెలవు మంజూరు చేయరాదని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాస్టల్ వార్డెన్లను, సంక్షేమ అధికారులను ఆదేశించారు. సుభాష్ నగర్ లోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్లో ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. తరగతులకు క్రమం తప్పకుండా మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. కారణం లేకుండా కళాశాలకు వెళ్లకుండా హాస్టల్లో ఉండకూడదని అన్నారు. హాస్టల్లో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వార్డెన్లు రోజువారీగా కళాశాలకు హాజరవుతున్న విద్యార్థుల వివరాలను తప్పక నమోదు చేయాలని అన్నారు. వసతి గృహంలో ఖాళీగా ఉన్న భవనాలను పరిశీలించిన కలెక్టర్ వాటికి అవసరమైన మరమ్మతులు చేయించి ప్రభుత్వ అవసరాలకు వినియోగించా లని తెలిపారు. హాస్టల్లో వినియోగంలో లేని శుద్ధజల ప్లాంట్ ను పరిశీలించారు. వారం రోజుల్లోగా ప్లాంట్ కు మరమ్మతులు చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందించాలని ఎస్సీ సంక్షేమ అధికారిని ఆదేశించారు. సందర్శనలో ఎస్సీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగలేశ్వర్ పాల్గొన్నారు.




**చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన**

కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం సందర్శించారు. ఈ కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న మహిళల వివరాలను రిజిస్టర్లో పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆరోగ్య సేవలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. యోగ కేంద్రాన్ని పరిశీలించారు. ఫార్మసీలో అందజేస్తున్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి థైరాయిడ్ మాత్రలను అందుబాటులో ఉంచాలని డిఎంహెచ్వో ను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు వైద్య సిబ్బంది హిమోగ్లోబిన్ పరీక్ష చేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్వో సుజాత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దాం

**ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అది శ్రీనివాస్**

**రాజన్న సిరిసిల్ల, శుభ తెలంగాణ :** గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించేందుకు వినాయక విగ్రహాల మండపాల బాధ్యులు, ఆయా శాఖల అధికారులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, ముస్లిం, క్రైస్తవ ప్రతినిధుల తో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో మంగళవారం శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్లు జిందం కళ, రామతీర్థం మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజలంతా ఐక్యమత్యంతో చేసుకోవాలని కోరారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఇతర దేశాలకు ఆదర్శ ప్రాయంగా నిలుస్తున్నాయని వివరించారు. పండుగకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. మండపాల నిర్వాహకులు, యువత అధికారులు చెప్పే సలహాలు పాటించాలని సూచించారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ నిబంధన మేరకు రెండు సౌండ్ బాక్స్ లు పెట్టుకోవాలని, నిర్వహకులు ఏ రోజున నిమజ్జనం చేస్తున్నారో పోలీస్ శాఖ వారికి తెలియజేయాలని సూచించారు. హైదరాబాదులో ఇప్పటికే వినాయక నవరాత్రి ఉత్సవాలపై సీఎం సమావేశం నిర్వహించారని గుర్తు చేశారు. ఏ ఇబ్బంది ఎదురైనా తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఉత్సవాలు ప్రారంభం నుంచి నిమజ్జనం అయ్యేదాకా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడ లో 18 మంది చొప్పున జాలర్లను నియమిస్తామని ఆ శాఖ అధికారులు తెలుపగా, మరో పది మందిని రిజర్వ్ లో వుంచి, లైఫ్ జాకెట్లు సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 108, 24ఓ7 క్విక్ రెస్పాన్స్ టీంలు, మందులు అందుబాటులో ఉంటాయని డీఎంహెచ్ఓ వసంతరావు తెలిపారు. ఎక్సైజ్, అగ్ని మాపక శాఖలు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. నిర్ణీత సమయానికి నిమజ్జనం చేయాలి జిల్లాలోని అన్ని మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా తమ మండపం, విగ్రహం ఎత్తు, ఏ రోజున నిమజ్జనం చేస్తారో వివరాలు ఇవ్వాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఆయా తేదీల్లో విగ్రహాలను నిర్ణీత సమయానికి తరలించి, రాత్రి రెండు గంటల వరకు నిమజ్జనం చేసేలా అందరూ సహకరించాలని కోరారు. ప్రతి మండపం వద్ద ప్లాస్టిక్ డ్రమ్లలో నీరు, ఇసుక నిలువ ఉంచాలని సూచించారు. పోలీస్ శాఖ వారి వెబ్సైట్ లో వివరాలు నమోదు చేయాలని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బంది ఎదురైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, మున్సిపల్ కమిషనర్లు మిర్జా ఫసహత్ అలీ బేగ్, సంపత్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గజ్వేల్ ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్

**సిద్దిపేట, శుభ తెలంగాణ :** జ్వరంతో ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లను ఆలస్యం చేయకుండా వెంటనే డెంగ్యూ పరీక్ష నిర్వహించి ట్రీట్మెంట్ అందించాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి వైద్యాధికారు లను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ గజ్వేల్ లోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఔట్ పేషెంట్ రిజిస్టర్, రక్త పరీక్షల ల్యాబ్, జర బాధితుల చికిత్స గది, మందులగది, డయాలసిస్, ఎస్ఎన్ సియు చిల్డ్రన్స్ వార్డులను తనికి చేసి రోగులకు అందుతున్న సేవలపై రోగులతో మాట్లాడి నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని త్వరలోనే వ్యాధులు నయమస్తా యని తెలిపారు. వానాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలుతు న్నందున ఆస్పత్రిలోని వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఆసుపత్రికి వివిధ జ్వరాలతో వచ్చిన వారికి ఆలస్యం చేయకుండా ర్యాపిడ్ టెస్టులు నిర్వహించి డెంగ్యూ నిర్ధారణకు ఎలిసా టెస్ట్ పంపించి వైద్య సేవలు అందించాలని అన్నారు. మెడిసిన్ స్టోర్ లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఏదైనా మెడిసిన్ పూర్తిగా అయిపోక ముందే స్టాక్ తెప్పించుకోవాలని అన్నారు. అదేవిధంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్స్పైరీ అయిన మందులను ఉపయోగించరా దని ఉన్నారు. నాలుగు సైకిల్స్ లలో అందిస్తున్న డయాలసిస్ సేవలు ఆస్పత్రి పరిధిలో నమోదైన 80 మంది డయాలసిస్ పేషెంట్లకు ప్రతిరోజు 5 సైకిల్స్ చొప్పున 40 మందికి డయాలసిస్ నిర్వహించాలని, ఎస్ ఎన్ సి ఎల్ చిన్నపిల్లల వార్డులో అప్రమత్తంగా ఉండి నవజాత శిశు వులకు ఇంక్యుబేటర్ సేవలు అందించాలని, ఆసుపత్రిలో సానిటేషన్ కార్యక్రమాలు రెగ్యులర్ గా నిర్వహించి ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయి కిరణ్ ను ఆదేశించారు.



జిల్లా కలెక్టర్ వెంట గజ్వేల్ ఆర్డీవో బలిసిలాల్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, తాసిల్దార్, ఎంపీడీవో ఉన్నారు.

## పగలు సాయం... రాత్రి చోరీ

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** హైదరాబాద్ మహానగరంలో వెరైటీ దొంగల బండారం బయటపడింది. ఉదయం.. దర్జాగా నటించి, రాత్రి అయితే చాలు, చటుక్కున మాయం చేస్తున్నారు. పక్కా స్కెచ్ వేసిన హైదరాబాద్ పోలీసులు కేటుగాళ్ల గుట్టురట్టు చేశారు. బోరుబండ ప్రాంతంలో రాత్రి వేళల్లో ఓ విచిత్రమైన సంఘటన చోటుచేసుకుంది. బీఎస్ఎన్ఎల్ కంపెనీకి సంబంధించిన భూగర్భ కేబుల్స్‌ను దొంగతనం చేశారు. అనుమానం వచ్చి సీసీ కెమెరా ఫుటేజీ చెక్ చేయడంతో అసలు భాగోతం బయటపడింది. బోరబండ ప్రాంతంలో బీఎస్ఎన్ఎల్ కంపెనీకి సంబంధించిన భూగర్భ కేబుల్స్ పనులు జరుగుతున్నాయి. 14 మంది సభ్యులతో కూడిన ఒక గ్యాంగ్ కూలీల అవతారం ఎత్తారు. ఈ గ్యాంగ్ సభ్యులు రోడ్డు పనుల కోసం కార్మికులుగా మారిపోయి, రాత్రి పూట తమ కార్యాచరణను కొనసాగించారు. అందరూ ఒక్కసారిగా వచ్చినట్లు కాకుండా, ఈ గ్యాంగ్ సభ్యులు తమను అధికారిక సిబ్బందిగా చూపించడానికి ప్రతిరోజూ రాత్రి రెఫ్లెక్టివ్ జాకెట్లు ధరించి వచ్చేవారు. వీరి ఉద్దేశం రాత్రి వేళల్లో ఎవరికీ అనుమానం రాకుండా పనులు చేసుకోవడం. పక్కా స్కెచ్‌తో వీరు మరింత విశ్వసనీయంగా కనిపించడానికి సంబంధిత పనులు చేస్తున్నట్లు ప్రజల ముందు ప్రవర్తించారు. గ్యాంగ్ సభ్యులు రాత్రివేళల్లో బీఎస్ఎన్ఎల్ కేబుల్స్‌ను కట్ చేసి తీసుకెళ్లడం మొదలుపెట్టారు. ఈ కేబుల్స్ లో ముఖ్యమైన కాపర్ వంటివి దొంగిలించారు. ఇలా 10 లక్షల రూపాయల విలువైన కాపర్ వైర్లు కొట్టేశారు. అయితే, ఈ గ్యాంగ్ అనుకోని విధంగా వారి పథకం విఫలమైంది. అయితే వీరు చేస్తున్న పనిని సీసీ కెమెరా దృశ్యాలు పట్టించాయి. హైదరాబాద్ బోయిన్‌పల్లి పోలీసులు వీరి అనుమానాస్పద దృశ్యాలను గమనించారు. అనుమానం కలిగిన పోలీసులు వారికి అనుమానం రాకుండానే గ్యాంగ్ సభ్యులను పట్టుకున్నారు. తీరా విచారణ చేసినప్పుడు, ఈ గ్యాంగ్ సభ్యులు తమ కార్మికుల వేషాలతో అసలు నిజాన్ని పోలీసుల ముందు ఒప్పుకున్నారు. పోలీసులు ఎట్టకేలకు వీరి నుంచి దొంగిలించిన కేబుల్స్‌ను స్వాధీనం చేసుకుని, 14 మంది సభ్యులను అరెస్టు చేశారు. వీరి ఆర్థిక పరిస్థితి బాగోలేని కారణంగానే ఈ తరహాలో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు విచారణలో బయటపడింది. వీరంతా కేవలం రాత్రి వేళల్లోనే ఈ తరహా కేబుల్స్ దొంగతనాలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో పోలీస్ కమాండ్ కంట్రోల్స్ సెంటర్‌లోనూ ఇదే తరహాలో కేబుల్స్ మాయమైన ఘటన చోటుచేసుకుంది. ఆ వ్యవహారంలోనూ పోలీసులు పలువురిని అరెస్టు చేశారు.

## ఉద్యోగుల జేఏసీ 100 కోట్ల విరాళం

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** భారీ వర్షాల కారణంగా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలో వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్నాయి. వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ముఖ్యంగా మున్నేరు వారు ఉపొంగి, ఖమ్మం నగరం దిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకొస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగుల సైతం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. సహాయక చర్యల్లో నిమగ్నమైన ప్రభుత్వానికి ప్రభుత్వ ఉద్యోగులు సైతం అండగా నిలుస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారని ఆయన గుర్తు చేశారు. ప్రకృతి విపత్తు కారణంగా భారీ నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందన్నారు. ఈ ఘటన తమను తీవ్రంగా కలిచివేసిందన్న లచ్చిరెడ్డి, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది అతిపెద్ద విపత్తుగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ భావించిందన్నారు జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి. ఇలాంటి సమయంలో తమ వంతుగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక పరంగా చేయూతగా నిలవాలని భావించామన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలోని ఉద్యోగుల తరుపున ఒక రోజు వేతనం సుమారు రూ.100 కోట్లను ప్రభుత్వానికి ఇచ్చేందుకు స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వానికి తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. వరద బాధితులకు అండగా నిలుస్తామన్నారు. తెలంగాణలోని అన్ని ప్రభుత్వ విభాగాలలోని ఉద్యోగుల తరఫున సమిష్టి నిర్ణయం తీసుకున్నట్లు లచ్చిరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంలో భాగంగా ఉన్న ఉద్యోగులుగా వరద విపత్తు సృష్టించిన ప్రాంతాలలో ప్రత్యక్షంగా సహాయక చర్యల్లో పాల్గొనడంతో పాటు తమ బాధ్యతగా ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందచేయనున్నట్టుగా చెప్పారు.

## తెలంగాణ, ఛత్తీస్ ఘడ్ మధ్య రాకపోకల బంద్

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** తెలుగు రాష్ట్రాలను వరుణుడు వణికిస్తున్నాడు.. తెలంగాణలో వర్షాలు దంచి కొడుతున్నాయి. వానల తీవ్రతకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు మత్తడి దుంకుతున్నాయి. పంటలు దెబ్బతిన్నాయి. ఎక్కడికక్కడ రోడ్లు, రైల్వే ట్రాకులు సైతం తెగిపోతున్నాయి. పలు చోట్ల చెట్లు, కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా గోదావరికి వరద పోటెత్తింది. ఈ క్రమంలోనే వాజేడు మండలంలోని టేకులగూడెం వద్ద జాతీయ రహదారిపైకి గోదావరి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేసి అధికారులు, పోలీస్ యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేశారు. ములుగు జిల్లా వాజేడు మండలంలోని టేకులగూడెం గ్రామం వద్ద హైదరాబాద్ టూ భూపాలపట్నం 163 జాతీయ రహదారి పైకి భారీగా గోదావరి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ముందు జాగ్రత్త చర్యలో భాగంగా ఇరు రాష్ట్రాలకు రాకపోకలను నిలిపివేశారు అధికారులు. మరోవైపు భారీ వర్షాలు, వరదల నేపపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకి రావొద్దని హెచ్చరించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అవసరం, ఆపద ఎదురైనా వెంటనే అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

## బీఆర్ఎస్ నేతలపై దాడి


**ఖమ్మం, శుభ తెలంగాణ :** ఖమ్మంలో వరదల రాజకీయం హీటెక్కింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఖమ్మం మున్నేరు అతలాకుతలమవుతోంది. దీంతో ప్రభుత్వ అధికారులతోపాటు సీఎం రేవంత్ వరద బాధితులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ నాయకులు బాధితులను పట్టించుకోక పోవడంపై సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. దీంతో మంగళవారం బీఆర్ఎస్ ముఖ్యనేతలు మున్నేరు వెళ్లడంతో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. మున్నేరు వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకుల వాహనాలపై రాళ్లదాడి జరిగింది. హరీష్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, నామా నాగేశ్వరరావును అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు.. గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. వారి కార్లపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు విసిరారు. ఓ బీఆర్ఎస్ కార్యకర్త కాలు విరిగినట్లు తెలుస్తుండగా.. ఈ దాడిలో నామా నాగేశ్వర రావు కారు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనపై స్పందించిన కేటీఆర్..ఇది ఖమ్మం కాంగ్రెస్ గుండాల దాడి అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలపై దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రులు హరీష్ రావు, పువ్వాడ, సబితా ఇంద్రారెడ్డి వాహనాలపై దాడి చేయటం కాంగ్రెస్ అసహనానికి నిదర్శనమన్నారు.

## వరద సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం విఫలం

**సహాయక చర్యలపై హరీశ్ రావు వ్యాఖ్యలు**


**ఖమ్మం, శుభ తెలంగాణ :** మాజీ మంత్రి హరీశ్ రావు మంగళవారం ఖమ్మం జిల్లాలోని వరద ప్రాంతాల్లో పర్యటించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. వరదల్లో సర్వం కోల్పోయి బాధితులు కట్టు బట్టలతో మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల్లో 30 మంది చనిపోతే ప్రభుత్వం 15 మందే చనిపోయారని చెబుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మృతుల కుటుంబాలకు ఏదో తూతూ మంత్రంగా నష్టపరిహారం ప్రకటించారని, మృతుల కుటుంబాలకు 25 లక్షల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వరదలకు ఇంత భారీ నష్టం జరిగినా కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఎన్ డిఆర్ఎఫ్ బలగాలను పంపలేదని హరీశ్ రావు ప్రశ్నించారు. వరద సహాయక చర్యల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం విఫలమయ్యాయని విమర్శించారు. వర్షం తగ్గిన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదన్నారు. వరద బాధితులు మంచి నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

# భయపెట్టిస్తున్న వైరల్ ఫివర్..



ప్రస్తుతం వర్షాలు ఎక్కువ పడుతున్నాయి. అసలు గ్యాప్ లేకుండా కంటిన్యూ గా వర్షాలు పడుతూనే ఉన్నాయి. అయితే ఈ వర్షాలు మొదలైన వెంటనే.. చాలా మంది అనారోగ్య బారిన పడుతున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు అందరు కూడా జ్వరాల బారిన పడుతున్నారు. మరి ముఖ్యంగా వైరల్ ఫివర్స్ వస్తున్నాయి. ఒక్కసారి ఫివర్ వస్తే.. ఇక అంతే సంగతి. ఆసుపత్రి చుట్టూ తిరగాలసిందే. చిన్నగా దగ్గు, జలుబు, జ్వరం స్టార్ట్ అయ్యి.. అది కాస్త పెద్దది అవుతుంది. బాడీ లో ఈ చిన్న లక్షణాలు కనిపించిన జాగ్రత్తలు తీసుకోకుండా.. ఏం కాదని పట్టించుకోరు. తీరా చివరికి పెద్దది అవుతుంది. ఇలా చాలా మంది వైరల్ ఫివర్స్ తో ఇబ్బంది పడుతున్నారు. అయితే ఆ ఫివర్ రాకుండా ఉండాలంటే ముందు చిన్న చిట్కాలు పాటించాలి. అప్పుడే వైరల్ ఫివర్స్ ని ఆరికట్టవచ్చు. మరి ఆ చిట్కాలు ఏంటో ఈరోజు మన స్టోరీ లో తెలుసుకుందాం. ఏ కాలమైన కొందరికి జలుబు, దగ్గు, జ్వరం వంటివి వస్తుంటాయి. కాబట్టి వీటిని తగ్గించుకోవాలంటే.. పరిశుభ్రత అనేది తప్పనిసరి. చాలా మంది అసలు చేతులు అవి శుభ్రం చేసుకోరు. దీని వల్ల బాక్టీరియా ఉండిపోయి.. ఫివర్ కి కారణం అవుతుంది. కాబట్టి బయటకు వెళ్లి వచ్చిన ప్రతిసారి, రెస్ట్ రూమ్ కి వెళ్లిన ప్రతిసారి కూడా హాండ్స్ శుభ్రం చేసుకోవాలి. అప్పుడే ఫివర్ రాకుండా ఆరికట్టగలం. చాలా మందికి ఇమ్యూనిటీ పవర్ తక్కువగా ఉంటుంది. బాడీ లో రోగ నిరోధక శక్తి లేకపోతే తొందరగా ఫివర్ వస్తుంది. కాబట్టి ఫుడ్ సరిగ్గా తింటూ.. ఫుల్ గా నిద్రపోవాలి. అలాగే రోగ నిరోధక శక్తి పెరిగేలా ఆహారం తీసుకోవాలి. రోజు వ్యాయామం, యోగా, మేడిటేషన్ వంటివి చేయాలి. జ్వరం వచ్చిన వాళ్లకు దూరంగా ఉండండి. వాళ్లు ఉపయోగించిన టవల్, సోప్ వంటివి వాడవద్దు. ఏ చిన్న లక్షణం కనిపించిన వెంటనే డాక్టర్ ను సంప్రదించండి. ఈ వైరల్ ఫివర్ ఎక్కువగా దోమలు వల్ల వస్తుంది. కాబట్టి దోమలు కుట్టకుండా జాగ్రత్తగా ఉండాలి. ఇంట్లో దోమ తెరలు వాడాలి. ఇంట్లో వాటర్ నిల్వ లేకుండా చూసుకోవాలి. ఈ కాలంలో వేడి నీరు తాగడం చాలా మంచిది. చాలా మందికి అసలు వేడి నీరు అంటే నచ్చదు. అలా అని చల్లని ఫ్రిడ్జ్ వాటర్ తాగుతారు. ఈ వాటర్ తాగడం వల్ల జలుబు, దగ్గు పెరిగి ఫీవర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి అన్ని విషయాల్లో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. లేకపోతే ఫీవర్ వచ్చి.. అది కాస్త పెరిగి మలేరియా, డెంగీకి కారణామవుతుంది. కాబట్టి ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించండి.

# కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారా..!




వయసు పెరిగే కొద్దీ కీళ్లు, ఎముకల నొప్పుల సమస్యలు అధికమవుతాయి. 50 ఏళ్లలోపు వ్యక్తులలో కూడా ఆర్థరైటిస్ ప్రమాదం పెరుగుతుంది. ఈ సమస్య కారణంగా.. నడవడం, సాధారణ పనులు చేయడం కష్టమవుతుంది. కీళ్ల నొప్పులు.. పురుషులు, మహిళలు ఇద్దరికీ వస్తాయి. మహిళలకు గర్భధారణ, రుతువిరతి సమయంలో హార్మోన్ల మార్పుల కారణంగా మహిళలకు కీళ్ల నొప్పుల సమస్య వచ్చే అవకాశ ఉందని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. భారతదేశంలో 60 ఏళ్లు పైబడిన ప్రతీ ముగ్గురిలో ఒకరు ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. 20, 30 సంవత్సరాల వయస్సులో వారికి కూడ ఈ సమస్య పెరుగుతోంది. అందుకు కారణం.. జీవనశైలి పాడైపోయిన తీరు వల్ల కీళ్లు, ఎముకల సమస్యలు ఎక్కువవుతున్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఎక్కువ సేపు కూర్చోవడం, వ్యాయామం చేయకపోవడం వంటి అలవాట్లు కూడా ఈ సమస్యకు దారి తీస్తున్నాయి. ఈ క్రమంలో.. చిన్న వయస్సు నుండే ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. చిన్నప్పటి నుంచే పౌష్టికాహారం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆర్థరైటిస్ సమస్య ఉన్నవారు కచ్చితంగా వైద్యులను సంప్రదించాలి. కీళ్ల నొప్పులు, వాపులు, ఆర్థరైటిస్ సమస్యలను తగ్గించడంలో కూడా కొన్ని ఇంటి నివారణలు సహాయపడతాయి. హాట్ అండ్ కోల్డ్ ఫోమెంటేషన్:హాట్ అండ్ కోల్డ్ ఫోమెంటేషన్ ఆర్థరైటిస్ సమస్యతో బాధపడుతున్న వారికి ఉపశమనం కలిగిస్తుంది. వేడి నీటి బ్యాగ్ (హీట్ ప్యాడ్) లేదా వేడి టవల్ ఉపయోగించి కీళ్లకు వేడిని వర్తింపజేయడం వల్ల కండరాలు రిలాక్స్ అవుతాయి. అలా.. నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. అదేవిధంగా కీళ్లపై ఐస్ బ్యాగ్స్‌ను అప్లై చేయడం ద్వారా వాపు, నొప్పి తగ్గుతాయి. ఆర్థరైటిస్ రోగులు డాక్టర్ సలహా మేరకు ఈ రెమెడీని క్రమం తప్పకుండా వాడాలి. ఆహారంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ విషయాలు చేర్చాలి.. ఆహారంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ విషయాలు చేర్చడం వల్ల కీళ్లలో వాపు తగ్గుతుంది. పసుపు, అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. పసుపులో కర్కుమిన్ ఉంటుంది. ఇవి వాపు, నొప్పిని తగ్గిస్తుంది. అదేవిధంగా అల్లం కూడా వాపును తగ్గించడానికి ఉపయోగపడుతుంది. కీళ్లనొప్పులు ఉన్నవారు రోజూ ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో ఒక చెంచా పసుపు కలిపి తాగడం వల్ల ఉపశమనం పొందవచ్చు.

# యాలకులతో ప్రయోజనాలు...



యాలకులను చాలా మంది వంటల్లో ఉపయోగిస్తారు. ఇక మసాలా వంటలు చేస్తే కచ్చితంగా ఇవి ఉండాల్సిందే. మసాలా మాత్రమే కాదు స్వీట్లలో కూడా మంచి పాత్ర పోషిస్తాయి యాలకులు. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడతాయి. అంతేకాదు ఆకలిని పెంచి, జీర్ణ సమస్యలను తగ్గిస్తాయని అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇవే కాకుండా ఇందులో ఉండే మూలకాలు జీర్ణక్రియ రేటును పెంచడంలో చాలా సహాయం చేస్తాయి. మరి ఈ యాలకుల గురించి మరిన్ని విషయాలు తెలుసుకుందాం. ముఖ్యంగా పాలల్లో యాలకులు వేస్తే వచ్చే ప్రయోజనాలు మరింత ఎక్కువ అంటున్నారు నిపుణులు. అదేంటో చూసేద్దామా? యాలకుల్లో విటమిన్ సి ఫుల్ గా ఉంటుంది. ఇది శరీరంలోని రోగ నిరోధక శక్తిని పెంచడంలో సహాయం చేస్తుంది. సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటి ఇన్‌ఫెక్షన్ల నుంచి శరీరాన్ని రక్షిస్తాయి యాలకులు. దీంతో పాటు శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి. యాలకుల్లో రైబోఫ్లావిన్, నియాసిన్ అనే మూలకాలు ఉంటాయట. కాబట్టి ప్రతి రోజు యాలకుల తాగడం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు అంటున్నారు నిపుణులు. యాలకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యాన్ని మంచి పాత్ర పోషిస్తాయి. ఇవి రక్తనాళాలను శుభ్రపరచి, రక్తపోటును నియంత్రిస్తుంది. ఇవే కాకుండా గుండెకు సంబంధించిన అన్ని రకాల సమస్యలు కూడా దూరం చేస్తాయి అంటున్నారు నిపుణులు. యాలకులు శ్వాసకోశ వాపును తగ్గిస్తాయి. గొంతు నొప్పి, ఆస్తమా వంటి సమస్యలను నివారించేందుకు కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే పొట్టలో కొవ్వు పేరుకుపోకుండా యాలకుల టీ సహాయం చేస్తుంది. అందుకే చాలా మంది యాలకుల టీని ఇష్టపడతారు. ఈ టీ టేస్ట్ ను కూడా అందిస్తుంది. శరీరంలో అదనపు కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె సమస్యలను పెంచుతుంది. కాబట్టి, మీరు క్రమం తప్పకుండా ఏలకుల టీ తాగడం వల్ల ఈ చెడు కొలెస్ట్రాల్‌ను సులభంగా వదిలించుకోవచ్చు అని సలహా ఇస్తున్నారు నిపుణులు. యాలకుల టీ ఒత్తిడిని తగ్గించి మానసిక ఆరోగ్యానికి సహాయం చేస్తుంది.

# బ్రెడ్‌కి ఎక్కువకాలం నిల్వ ఉండాలంటే..



ప్రస్తుతం మనం బతుకుతున్నది ఆధునిక యుగంలో.. అన్ని పనులు త్వరగా పూర్తవ్వాలని ఆశిస్తుంటాం. ఆహారం విషయంలో కూడా అంతే.. అందుకే ఉదయం అల్పాహారంలో కష్టపడి వండుకునేందుకు బద్ధకంగా మారింది. అప్పటికప్పుడు త్వరగా పూర్తి చేసుకునే మ్యాగీ నూడుల్స్, బ్రెడ్ తో చేసిన వాటికి డిమాండ్ బాగా పెరిగింది. ముఖ్యంగా బ్రెడ్ సాండ్‌విచ్ తినేవారి సంఖ్య ఎక్కువ. స్కూల్, కాలేజ్, ఆఫీస్ లకి వీటినే తీసుకెళ్లడానికి ఇష్టపడతారు. మార్కెట్ నుంచి బ్రెండ్ కొనుగోలు చేసి ఇంటికి తీసుకొస్తుంటాం. అయితే బ్రెడ్ కొనేటప్పుడు, దానిని ఇంట్లో నిల్వ చేసే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించండి. ముఖ్యంగా బ్రెడ్ కొనేటప్పుడు దాని ప్యాకెట్ వాలిడిటీని చెక్ చేసుకోవాలి. నిజానికి కానీ మనం బ్రెడ్ ను ఎక్కువ కాలం నిల్వ చేయలేం. బ్రెడ్‌ను ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల ఎప్పుడూ తాజాగా ఉంటుందని చాలా మంది అనుకుంటారు. కానీ నిజానికి ఫ్రిజ్‌లో బ్రెడ్ నిల్వ చేయడం ప్రతికూల పరిణామాలను కలిగిస్తుంది. సాధారణంగా, బ్రెడ్ తయారు చేసినప్పుడు, దానిలోని స్టార్చ్ అణువులు నీటిని గ్రహించి గట్టిపడతాయి. దీని కారణంగా బ్రెడ్ మృదువైన , మెత్తటి ఆకృతిని పొందుతుంది. అయితే, మనం బ్రెడ్ చల్లని వాతావరణంలో ఉంచినప్పుడు, స్టార్చ్ అణువులు తిరిగి స్ఫటికీకరించడం దాని నుంచి నీటిని బయటకు పంపడం ప్రారంభిస్తాయి. ఇది బ్రెడ్ గట్టిపడుతుంది పొడిగా అయిపోతుంది. అలా అని బయట ఉంచితే దానిపై ఫంగస్ చేసి చేరుతుంది. ఇలాంటి బ్రెడ్ తినడం ఆరోగ్యానికి హానికరంగా మారుతుంది. అయితే బ్రెడ్ ను ఫ్రిజ్ లో ఉంచాలని మీరు భావిస్తే.. గాలి కూడా దూరని బాక్స్ లో లేదా ప్యాకెట్ ఓపెన్ చేయకుండా అందులో ఉంచడం మంచిది. గాలి పారితే మాత్రం అది గట్టిగా అయిపోతుంది. ఇక బ్రెడ్ రోజుల తరబడి పాడవుకుండా.. మృదువుగా ఉండాలంటే.. దానిని శుభ్రమైన పొడి వస్త్రంలో చుట్టి ఉంచ వచ్చు. ఇలా చేయడం వల్ల దానిపై ప్రమాదకర ఫంగస్ చేరదు. రెండు రోజుల వరకూ అది తాజాగా ఉంటుంది.

# పానీపూరి తినడం వల్లే.. అమ్మాయిల్లో ఆ సమస్య వస్తుందా?



పానీ పూరి.. ఈ పేరు చెబితే చాలు ప్రతి ఒక్కరి నోట్లో ఊరిలు వచ్చేస్తూ ఉంటాయి. అంతలా ఫేమస్ అయిపోయింది ఈ ఫుడ్. అతి తక్కువ ధరలో అందరికీ అందుబాటులో ఉండే పానీపూరి రుచిలో కూడా అన్ని రకాల ఆహారాలను మరిపిస్తూ ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఇక పానీపూరి తినడానికి ఇష్టపడుతూ ఉంటారు అని చెప్పాలి. చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్దవాళ్ల వరకు ప్రతి ఒక్కరు కూడా ఈ పానీ పూరికి ఫ్యాన్స్ ఉంటారు. ఈ పానీ పూరి అమ్మే బండ్లు ఏకంగా మురికి కాలువల పక్కన ఉన్న.. చుట్టూ అంత అపరిశుభ్రమైన వాతావరణం ఉన్నప్పటికీ ఇవేవీ పట్టించుకోకుండా ఏకంగా పానీపూరి లాగించేస్తూ ఉంటారు అందరూ. మరి ముఖ్యంగా మహిళలకు పానీ పూరి అంటే ఎంత ఇష్టం ఉంటుందో మాటల్లో కూడా చెప్పలేం. అందుకే మహిళలకు ఇక ఈ ఆహారంపై ఉండే ఇష్టం తెలియజేసేలా సోషల్ మీడియాలో ఎన్నో మీమ్స్ కూడా పుట్టుకు వస్తూ ఉంటాయి అన్న విషయం తెలిసిందే. అయితే ఈ పాని పూరి అనేది ఆరోగ్యానికి ఎంతో హానికరం. మరీ ముఖ్యంగా మహిళలకు పానీపూరి తినడం కారణంగా ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తూ ఉంటాయి. ఈ మధ్యకాలంలో మహిళలు ఎక్కువగా బాధపడుతున్న ఆరోగ్య సమస్యల్లో పిసిఓడి సమస్య కూడా ఒకటి అన్న విషయం తెలిసిందే. మహిళల్లో ఈ సమస్య రోజురోజుకు అధికమవుతుంది తప్ప తగ్గు ముఖం పట్టడం లేదు. అయితే ఈ సమస్యకు కూడా పానీ పూరి తినడమే కారణం అంటూ నిపుణులు గుర్తించారు. అమ్మాయిలు రోజు పానీ పూరి తింటూ ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారని వైద్యులు చెప్పుకొచ్చారు. దీనివల్ల అమ్మాయిల్లో పిసిఓడి సమస్యలు అధికమవుతున్నట్లు చెబుతున్నారు. ఇర్రెగ్యులర్ సైకిల్స్, బరువు పెరగడం పెదాలపై రోమాలు పెరగడం సమస్యలు పానీ పూరి తింటున్న అమ్మాయిల్లో గుర్తించినట్లు వైద్యులు పేర్కొన్నారు. అయితే పానీపూరీలో నీరు హైజినిక్ గా ఉండకపోతే టైఫాయిడ్ బారిన పడే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరించారు వైద్యులు.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110